




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 69, పేజీలు - 08

మంగళవారం, ఆగష్టు 12, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## పతనం దిశగా బీఆర్ఎస్.?

### – చంద్రశేఖరా.. ఏమైంది నీ పార్టీకి.?




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్. మొదటి లక్ష్యం సాధించింది. స్వరాష్ట్రం సిద్ధించింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రజలు రాష్ట్రం సాధించిన పార్టీగా 2014లో గులాబీ పార్టీకే పట్టం కట్టారు. మరోసారి 2018లో కూడా అవకాశం ఇచ్చారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ బలమైన శక్తిగా ఎదిగింది. కానీ ఇప్పుడు పతనం దిశగా పయనిస్తోంది. గులాబీ బాస్ కేసీఆర్ వారసుల చెరోదారి నాయకత్వ సంక్షోభం, వ్యక్తిగత విమర్శలతో కూడిన సోషల్ మీడియా వ్యూహంతో కొట్టుమిట్టాడుతోంది. గువ్వల బాలరాజు వంటి నాయకుల వలసలు, పార్టీ సోషల్ మీడియా విధానాలు, ప్రజా సమస్యలపై పోరాటాల లేమి వంటి అంశాలు బీఆర్ఎస్ దిగజారుడుకు కారణాలుగా కనిపిస్తున్నాయి.

### వ్యక్తిగత విమర్శలతో నష్టం..

బీఆర్ఎస్ నుంచి ఇటీవల బీజేపీలో చేరిన గువ్వల బాలరాజు వ్యవహారం పార్టీలోని అంతర్గత సమస్యలను స్పష్టంగా తెలియజేస్తోంది. బాలరాజు తన రాజీనామా లేఖలో బీఆర్ఎస్ నాయకత్వాన్ని గౌరవిస్తూనే, తన రాజకీయ భవిష్యత్ కోసం బీజేపీలో చేరినట్లు పేర్కొన్నారు. అయితే, బీఆర్ఎస్ సోషల్ మీడియా బృందం ఆయనను, ఆయన భార్యను వ్యక్తిగతంగా విమర్శిస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా పార్టీ ఇమేజ్‌ను మరింత దిగజార్చింది. రాజకీయ నాయకులు ఒక పార్టీ నుంచి మరొక పార్టీకి వెళ్లడం సర్వసాధారణం. అయితే, వలసపోయే నాయకులపై వ్యక్తిగత దాడులు చేయడం, బూతులతో కూడిన సోషల్ మీడియా పోస్ట్‌లు చేయడం వంటివి గులాబీ పార్టీకి రాజకీయంగా నష్టం కలిగిస్తున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నడిచే సోషల్ మీడియా పోస్టులు ఆయనకు తెలియకుండా వస్తున్నవి కావన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటువంటి విమర్శలు ప్రజల్లో పార్టీపై చిరాకు, అసహ్యం కలిగించే అవకాశం ఉంది. బాలరాజు స్పందన కూడా ఈ విమర్శలకు బదులుగా తీవ్రంగా ఉండటం, బీఆర్ఎస్ వ్యూహం రివర్స్ అవుతున్నట్లు సూచిస్తోంది.

### సోషల్ మీడియా వైఫల్యం..

బీఆర్ఎస్ సోషల్ మీడియా వ్యూహాలను ఏపీలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విధానాలతో పోలుస్తున్నారు. వ్యతిరేకులపై అనుచిత వ్యాఖ్యలు, బూతులతో కూడిన ట్వీట్‌లు, తప్పుడు ప్రచారం చేయడం వంటివి బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రధాన లక్షణాలుగా మారాయి. ఈ విధానం ఓటర్లను ఆకర్షించడంలో విఫలమవడమే కాక, పార్టీకి ఉన్న మద్దతుదారులను కూడా అసంతృప్తికి కారణమవుతోంది. సోషల్ మీడియాను రాజకీయ ఆయుధంగా ఉపయోగించుకోవచ్చు, కానీ అది సానుకూలంగా, ఆకర్షణీయంగా ఉండాలి. బీఆర్ఎస్ విషయంలో, సోషల్ మీడియా బృందం ప్రతికూల వ్యాఖ్యలపై దృష్టి సారించడం వల్ల పార్టీ ఇమేజ్ దెబ్బతింటోంది.

### ప్రజా సమస్యలపై పోరాటం ఎక్కడ?

ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై గ్రౌండ్ లెవల్‌లో ఎలాంటి పోరాటం చేయలేదు. పార్టీ

2లో..

## ఈసీ కార్యాలయానికి రాహుల్ ర్యాలీ

### - మధ్యలోనే నిర్బంధం, తీవ్ర ఉద్రిక్తత



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కర్నాటకతో పాటు పలు రాష్ట్రాల్లో గత ఎన్నికల సందర్భంగా భారీ ఎత్తున ఓట్ల చోరీ జరిగిందని ఆరోపిస్తున్న లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఇతర ఇండియా కూటమి నేతలు ఢిల్లీలో భారీ ప్రదర్శన చేపట్టారు. కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్లేందుకు ర్యాలీగా బయలుదేరారు. అయితే వారిని పోలీసులు మధ్యలోనే అడ్డుకుని పోలీసు స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఉదయం పార్లమెంట్ సమావేశాలకు హాజరైన రాహుల్, ఇతర ఇండియా కూటమి ఎంపీలు అక్కడి నుంచి ఓట్ల చోరీపై నిరసన తెలిపేందుకు ఎన్నికల సంఘం కార్యాలయానికి భారీగా ర్యాలీగా బయలుదేరారు. ఢిల్లీ రోడ్లపై భారీ ఎత్తున తరలివచ్చిన ఇండియా కూటమి పార్టీల కార్యకర్తలు, నేతలు, ఎంపీలతో ఈ ర్యాలీ

2లో..

## ఏపీలో లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

### - సీఎం చంద్రబాబు కీలక సమీక్ష




అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని కీలకమైన పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల మొదటి దశ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా ఈ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వేగవంతం చేయాలని, వాటిని రాష్ట్రానికి ఆర్థిక వనరులుగా మార్చాలని ఆయన సూచించారు. సోమవారం ఉండవల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో పోర్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో చంద్రబాబు ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో రవాణా, సరఫరా వ్యవస్థలను మరింత పటిష్ఠం చేసేందుకు ఏపీ లాజిస్టిక్స్ కార్పొరేషన్‌ను త్వరితగతిన ఏర్పాటు చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పోర్టులు,

2లో..

## సైన్యంలో పురుషుల పోస్టులను రిజర్వ్ చేయలేం

### - సుప్రీంకోర్టు సంచలనం




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) సైన్యంలో పురుషుల పోస్టులను రిజర్వ్ చేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఏకపక్ష 'పురుష-స్త్రీ' కోటాను తప్పుపట్టింది. సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ లీగల్ పోస్టుల కోసం జరిగిన పరీక్షల్లో ఇద్దరు మహిళా అధికారులు వరుసగా 4, 5వ ర్యాంకులను సాధించారు. అయినప్పటికీ వీరిని విధుల్లోకి

2లో..

## రెడ్ బుక్ ను లోకేష్ పక్కనబెట్టేశారా.?

### - రీజన్ ఏంటి.?



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీలో గత వైసీపీ ప్రభుత్వం విపక్షంలో ఉన్న టీడీపీ కార్యకర్తల్ని, నాయకుల్ని లక్ష్యంగా చేసుకుని దాడులు, కేసులతో భయభ్రాంతుల్ని చేస్తున్న సమయంలో వారిలో స్థైర్యం నింపేందుకు అప్పట్లో నారా లోకేష్ రెడ్ బుక్ ను తెరపైకి తెచ్చారు. వైసీపీ హయాంలో టీడీపీని టార్గెట్ చేస్తున్న ప్రతీ నేత, అధికారి పేరును అందులో నమోదు

2లో..

## కాంగ్రెస్ 6 గ్యారంటీలతో దిగజారిన తెలంగాణ ఆర్థిక వ్యవస్థ

### - కేటీఆర్ విమర్శలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ అభివృద్ధిలో తీవ్రమైన క్షీణత కనిపిస్తోంది. ఇదంతా చూడాల్సి వస్తుందని ఎప్పుడూ ఊహించలేదు అని తాజా కాగ్ నివేదిక అందుకు అద్దం పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వైఫల్యం, చేతికానితనం కారణంగా తెలంగాణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి త్రైమాసికంలో తెలంగాణ ఆదాయం బాగా తగ్గిందని కాగ్ నివేదికలో వెల్లడైందన్నారు.

### రాష్ట్రాన్ని నాశనం చేస్తున్న ఆరు గ్యారంటీలు

'కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం 6 గ్యారంటీలను ఇచ్చింది. కానీ అదే హామీలు తెలంగాణ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీశాయి. ఆర్థిక రంగానికి హామీలే తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. తెలంగాణ ప్రభుత్వ ఆదాయం తగ్గుముఖం పడుతోంది, మరోవైపు అప్పులు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇది రాకెట్ శాస్త్రం మాత్రం కాదు. అందరికి అర్థమయ్యే లెక్కలు, వివరాలే. కాంగ్రెస్ నేతల అనుభవ లేమి, పాలనా వైఫల్యంతో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ పతనం అవుతోంది.

### మిగులు బడ్జెట్ అన్నారు.. పెద్ద మొత్తంలో అప్పులు

కాంగ్రెస్ ప్రభుత్వం ?2,738 కోట్లు మిగులు బడ్జెట్ చూపించారు. కానీ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం ముగిసే సమయానికి తెలంగాణకు ?10,583 కోట్ల ఆదాయ లోటు వచ్చింది. ఈ ప్రభుత్వం ఇప్పటికే రూ.20,266 కోట్లు

2లో..

## హైడ్రా సిబ్బందికి శుభవార్త

### - మార్షల్స్ జీతాలు తగ్గవని హామీ ఇచ్చిన రంగనాథ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రకృతి వైపరీత్యాల సమయంలో రాత్రింబవళ్లు ప్రజలకు సేవలు అందిస్తున్న హైడ్రా సిబ్బందికి శుభవార్త. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఒక జీవో కారణంగా హైడ్రా మార్షల్‌ల జీతాలు తగ్గుతాయనే ఆందోళనపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టత ఇచ్చారు. ఈ జీవోతో జీతాలు తగ్గుతాయని కొంతమంది మార్షల్స్ ఆందోళన పడ్డారని, కానీ వారి జీతాలు తగ్గవని ఆయన హామీ ఇచ్చారు.

### అసలు ఆందోళన ఎందుకు?

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం ఇటీవల ఒక జీవో విడుదల చేసింది. ఈ జీవోలోని కొన్ని నిబంధనల వల్ల హైడ్రాలో పనిచేస్తున్న మార్షల్స్ జీతాలు తగ్గుతాయేమోనని అనుమానం వ్యక్తం చేశారు. దీంతో కొంతమంది విధులకు గైర్హాజరయ్యారనే వార్తలు కూడా వచ్చాయి. అయితే, సోమవారం కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ మార్షల్‌లతో మాట్లాడి, వారి అనుమానాలను నివృత్తి చేశారు. గతంలో ఉన్న జీతాలే వారికి చెల్లించబడతాయని, ఏ ఒక్కరికీ జీతం తగ్గదని

2లో..

## వేతనాల పెంపు డిమాండ్‌తో సినీ కార్మికుల సమ్మె

- ప్రభుత్వానికి చేరిన వివాదం
- నిలిచిపోయిన తెలుగు సినిమా షూటింగులు
- రంగంలోకి దిగిన తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- చర్చల ద్వారా సహేతుకమైన పరిష్కారం కనుగొనాలని మంత్రి సూచన
- 30 శాతం పెంపు చిన్న సినిమాలకు భారమంటున్న నిర్మాతలు



2లో..

## సీఎం రేవంత్ రెడ్డికి భారీ ఊరట

### - ఆ కేసును కొట్టేసిన హైకోర్టు

2లో..



## తెలంగాణలోని ములుగు జిల్లాలో ఐటీ కంపెనీ

### - ఆగస్టు 18న శంకుస్థాపన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలోని ములుగు జిల్లాలో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతోంది. ఈ నెల 18న ములుగులో ఐటీ కంపెనీకి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేసి శాశ్వత భవనానికి పునాది వేయనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు.
దీని ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని జిల్లా ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని మంత్రి పేర్కొన్నారు. ఐటీ ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. స్థానికులకు ఇక్కడే మంచి ఉద్యోగం లభించే అవకాశం

2లో..

# పతనం దిశగా బీఆర్ఎస్.?

నిర్వహించే కార్యక్రమాలు ఎక్కువగా రాజకీయ లక్ష్యాలతో లేదా కేసీఆర్ సమస్యల చుట్టూ తిరుగుతున్నాయి. తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన సమస్యలు ఉపాధి, విద్య, ఆరోగ్యం, లేదా రైతు సమస్యలపై బీఆర్ఎస్ ఎలాంటి ఉద్యమం చేపట్టలేదు. కేవలం రాజకీయ లాభాల కోసం కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పార్టీ ప్రజల నుంచి దూరమవుతోంది. ఒక బలమైన ప్రతిపక్షంగా, ప్రజల సమస్యలను గుర్తించి, వాటి కోసం గళమెత్తి, ఉద్యమాలు నడిపితేనే ప్రజల విశ్వాసం సంపాదించగలదు. బీఆర్ఎస్ నాయకత్వం స్పష్టమైన దిశానిర్దేశం లేకుండా కొట్టుమిట్టాడుతోంది. పార్టీ నుంచి నాయకులు వలసపోవడం, సోషల్ మీడియాలో అనుచిత వ్యవహారం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా వ్యక్తిగత దూషణలకు దిగడం, దిగజారుడు మాటలు మాట్లాడడం, ఇక కవిత సొంత పార్టీకి దూరం కావడం, గులాబీ నేతలపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం బీఆర్ఎస్ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. పార్టీ నాయకత్వం ఒకప్పుడు తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచినప్పటికీ, ప్రస్తుతం పార్టీలో కొత్త నాయకత్వం, కొత్త వ్యూహాలు అవసరమైన సమయంలో పాత విధానాలతోనే ముందుకెళ్లడానికి ప్రయత్నిస్తోంది.

# ఈసీ కార్యాలయానికి రాహుల్ ర్యాలీ

సాగింది. అయితే ఈసీ కార్యాలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు రాహుల్ సహా ఇతర ఇండియా కూటమి ఎంపీల్ని అదుపులోకి తీసుకున్నారు. రాహుల్ గాంధీతో పాటు ప్రియాంక గాంధీ వాద్రా, సంజయ్ రౌత్ , సాగరికా ఘోష్ వంటి ఇండియా కూటమి ఎంపీలు పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా రాహుల్ మీడియాతో మాట్లాడారు. వాస్తవం ఏమిటంటే వారు మాట్లాడలేరని, నిజం దేశం ముందు ఉందని రాహుల్ గాంధీ తెలిపారు. ఈ పోరాటం రాజకీయమైనది కాదని, ఈ పోరాటం రాజ్యాంగాన్ని కాపాడటానికి అన్నారు. ఈ పోరాటం ఒక మనిషి, ఒక ఓటు కోసమే అన్నారు. తమకు స్వచ్ఛమైన, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా కావాలన్నారు.

# ఏపీలో లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

విమానాశ్రయాలు, రహదారులను అనుసంధానిస్తూ సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. దీని ద్వారా లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించి, ఎగుమతి సామర్థ్యాన్ని పెంచవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పోర్టులు, పారిశ్రామిక ప్రాంతాలకు అనుసంధానం మెరుగుపరిచేందుకు, ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా పీపీపీ పద్ధతిలో రహదారుల విస్తరణ చేపట్టాలని అధికారులకు తెలిపారు. స్థానిక మత్స్యకారుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా, కొన్ని ఫిషింగ్ హార్బర్లను మైనర్ పోర్టులుగా అప్‌గ్రేడ్ చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం కోరారు. మచిలీపట్నం, రామాయపట్నం, మూలపేట, కాకినాడ గేట్‌వే పోర్టులతో పాటు, జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ల తొలి దశ పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## సైన్యంలో పురుషుల పోస్టులను

# రిజర్వ్ చేయలేం

తీసుకోకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇటీవల వాదనల సందర్భంగా సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ (లీగల్) బ్రాంచీ పోస్టుల్లో మహిళా అధికారులు తక్కువగా ఉండటంపై సుప్రీం అసహనం వ్యక్తం చేసింది. తాజాగా తీర్పును సోమవారం వెలువరించింది.భారత సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ బ్రాంచి పోస్టుల్లో నియామకాల కోసం అనుసరిస్తున్న 2:1 రిజర్వేషన్ నిష్పత్తి విధానం సరికాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దాన్ని అమలు చేయకూడదని తేల్చి చెప్పింది. మహిళలపై పరిమితి పెట్టి ఖాళీ పోస్టులను పురుషులకు రిజర్వ్ చేయకూడదని సుప్రీం కోర్టు వెల్లడించింది. అర్షూర్నౌర్, ఆస్థ త్యాగీ అనే మహిళలు ఇద్దరు సుప్రీంను ఆశ్రయించారు. పురుష అభ్యర్థులకన్నా తమకు మెరిట్ ఎక్కువ ఉన్నప్పటికీ, మహిళల కోటాల్లో ఖాళీలు లేవంటూ వారిని ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తపరిచారు. గతంలో వీరి పిటిషన్పై విచారణ జరిపిన న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది.

### ఆగ్రహం వ్యక్తం చేసిన అత్యున్నత న్యాయస్థానం

ఆర్మీ ఉన్నతాధికారులపై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. పురుషులకు 6, మహిళలకు 3 పోస్టులు కేటాయించాలని నిష్పత్తి పెట్టడం ఏకపక్ష నిర్ణయం అని అభివర్ణించింది. లింగ తటస్థతకు నిజమైన అర్థం ఏంటంటే, స్త్రీ, పురుష భేదం లేకుండా ప్రతిభావంతులైన అభ్యర్థులను ఎంపిక చేయడమే అని పేర్కొంది. అంతేగానీ ఇలా మహిళలకు సీట్లను పరిమితం చేయడం సమానత్వ హక్కును ఉల్లంఘించడమే అవుతుందని తెలిపింది. మహిళలపై పరిమితి పెట్టి, ఖాళీ పోస్టులను పురుషులకు రిజర్వ్ చేయడం సమంజసం కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఇలాంటి విధానాలను అనుసరిస్తే ఏ దేశం భద్రంగా ఉండదని ధర్మాసనం పేర్కొంది. ఇకపై సమానత్వ పద్ధతిలోనే నియమకాలు చేపట్టాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఎంపిక విధానంలో భాగంగా స్త్రీ, పురుష అభ్యర్థుల మెరిట్ జాబితాను బహిర్గతం చేయాలని సూచించింది.

# రెడ్ బుక్ ను లోకేష్ పక్కనబెట్టేశారా.?

చేసుకుంటున్నామని, వారికి తాము అధికారంలోకి రాగానే వడ్డీతో సహా తిరిగి ఇచ్చేస్తామని పదే పదే చెప్పేవారు. అలాగే అధికారంలోకి వచ్చాక కూడా రెడ్ బుక్ గురించి లోకేష్ పలుమార్లు ప్రస్తావించారు. అయితే కొంతకాలంగా లోకేష్ రెడ్ బుక్ ను ప్రస్తావించడమే మానేశారు.రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక రెడ్ బుక్ 1, 2, 3 అంటూ పలుమార్లు మంత్రిగా లోకేష్ దీని ప్రస్తావన చేశారు. గతంలో టీడీపీని ఇబ్బందిపెట్టిన పలువురు వైసీపీ నాయకులు, అధికారులపై చర్యలు తీసుకుంటున్న సందర్భంలో లోకేష్ రెడ్ బుక్ పేరు ప్రస్తావించేవారు. అయితే కొంతకాలంగా లోకేష్ రెడ్ బుక్ గురించి ప్రస్తావించడమే మానేశారు. దీంతో లోకేష్ ఇలా రెడ్ బుక్ పక్కనపెట్టేయడం వెనుక రీజన్ ఏంటన్న చర్చ టీడీపీ క్యాడర్, నాయకుల్లో జరుగుతోంది.మరోవైపు లోకేష్ గతంలో విపక్షంలో ఉండగా రెడ్ బుక్ ప్రస్తావన చేసినప్పుడల్లా వైసీపీ ఎగతాళి చేసేది. ఆ తర్వాత కూటమి అధికారంలోకి వచ్చాక అదే వైసీపీ నేతల్ని టార్గెట్ చేయడం మొదలుపెట్టగానే జగన్ సహా ఇతర పార్టీ నేతలంతా రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్న చర్చను పెద్ద ఎత్తున ప్రస్తావించడం మొదలుపెట్టారు. వైసీపీ నాయకులు ఎక్కడ ఏ ప్రెస్ మీట్ పెట్టినా, మీడియాతో మాట్లాడినా రెడ్ బుక్ గురించిన చర్చ లేకుండా ఉండేది కాదు. కేంద్రానికీ దీనిపై ఫిర్యాదు చేశారు.దీంతో అధికారంలో ఉన్న ప్రభుత్వం రెడ్ బుక్ అంటూ ప్రత్యేక రాజ్యాంగం అమలు చేస్తోందని, వైసీపీని టార్గెట్ చేసేందుకే ఇలా రెడ్ బుక్ పేరుతో బెదిరింపులకు దిగుతున్నారన్న ఆరోపణలు ఎక్కువయ్యాయి. అదే సమయంలో వైసీపీలో జగన్ తప్ప కీలక నేతలపై ఏదో విధంగా కేసులు నమోదు చేశారు. వీరిలో కొందరిని జైళ్లకు కూడా పంపారు. దీంతో రెడ్ బుక్ ఆపరేషన్ విషయంలో టీడీపీ క్యాడర్ కూడా సంతృప్తిగానే కనిపిస్తోంది. అందుకే ఇప్పుడు లోకేష్ కొంతకాలంగా రెడ్ బుక్ ను ప్రస్తావించడం ఆపేసినట్లు తెలుస్తోంది.

# కాంగ్రెస్ 6 గ్యారంటీలతో దిగజారిన తెలంగాణ ఆర్థిక వ్యవస్థ

అప్పుగా తీసుకుంది. ఇది వార్షిక లక్ష్యంలో 37.5 శాతం. మరోవైపు రాష్ట్రంలో పన్నేతర ఆదాయాలు తీవ్రమైన తగ్గుదలను సూచిస్తున్నాయి. రూ.2,26,720 కోట్ల బడ్జెట్‌లో కేవలం 3.37 శాతం మాత్రమే ఆదాయాన్ని సాధించారు.

**ప్రాజెక్టులు, పథకాలకు నిధుల్లేవ్..**

### డబ్బులు ఎక్కడ పోతున్నాయ్

ఒక కొత్త రోడ్డు వేయకుండా, ఒక కొత్త ప్రాజెక్ట్ ప్రారంభించకుండా, విద్యార్థులకు మంచి భోజనం ఇవ్వకుండానే ఈ ప్రభుత్వం ఏకంగా రూ.20,266 కోట్లు ఖర్చు చేసింది. ఈ ఖర్చు చేసిన డబ్బు ఎక్కడికి పోతోంది? ఆర్థిక వ్యవస్థ ఈ విధంగా కుప్పకూలిపోవడానికి కారణం ఏంటి? తెలంగాణ ఆర్థిక వ్యవస్థ గాడిన పడిందని, గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నేతలు ఈ పరిస్థితిని ఎలా వివరించగలరు?. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు కాంగ్రెస్ ఆర్థిక నిపుణులు దీనికి వారి వద్ద ఉన్న పరిష్కారం ఏంటో స్పష్టంగా చెప్పగలరా?' అని కేటీఆర్ తెలంగాణ ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ నేతలను సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనపై కేటీఆర్ పలుమార్లు విమర్శలు గుప్పించారు. ఢిల్లీకి నోట్ల మూటలు మోసేందుకు పదే పదే ఢిల్లీకి వెళ్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రాజెక్టులు చేపట్టకుండా, రైతులు, మహిళలకు హామీలు అమలు చేయకుండా పైసలు ఎక్కడికి పోతున్నాయి అని కేటీఆర్ ప్రశ్నించారు.

# వేతనాల పెంపు డిమాండ్‌తో సినీ కార్మికుల సమ్మె

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సినీ కార్మికుల వేతనాల విషయంలో ఏర్పడిన వివాదంతో సినిమా షూటింగులు ఆగిపోయాయి. 30 శాతం వేతనాలు పెంచాలని కార్మిక ఫెడరేషన్లు డిమాండ్ చేస్తున్నాయి. కార్మికులు షూటింగ్‌లకు వెళ్లకపోవడంతో చాంబర్ కూడా షూటింగ్‌లను నిలిపివేసింది. పలు దఫాలుగా కార్మికులు, నిర్మాతల మధ్య చర్చలు జరిగాయి. అయితే నిర్మాతలు చాలా ఇబ్బందుల్లో ఉన్నామని ఇప్పుడు 30 శాతం వేతనాలు పెంచలేమని అంటున్నారు. పదిహేను శాతం వరకూ పెంచుతామని చెబుతున్నారు. కానీ కార్మిక ఫెడరేషన్లు అంగీకరించడం లేదు. ఎప్పుడో మూడేళ్ల కిందట జీతాలు పెంచారని మూడేళ్ల తర్వాత పెంచుతామన్నారని గుర్తు చేశారు. మూడు ఏళ్లు దాటిపోయినా ఏమీ మాట్లాడకపోవడంతో సమ్మె నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని అంటున్నారు. ఈ సమస్యపై టాలీవుడ్ నిర్మాతలు కొంత మంది మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో సమావేశం అయ్యారు. కార్మిక సంఘాల తరపున వల్లభనేని అనిల్ కూడా మంత్రితో సమావేశానికి వచ్చారు. టాలీవుడ్ లో ఏర్పడిన వివాదంపై మంత్రి పూర్తిగా తెలుసుకున్నారు. సమస్యలు ఎన్ని ఉన్నా షూటింగ్ లు నిలిపివేయడం మంచిది కాదన్నారు. పని చేస్తూనే చర్చలు జరుపుకోవాలని కోమటిరెడ్డి సలహా ఇచ్చారు. అన్ని వర్గాలకూ సమస్యలు ఉంటాయని ఇరు వర్గాలు చర్చించుకుని పరిష్కరించుకోవాలన్నారు. నిర్మాతలు కొంత పెంచుతామని హామీ ఇస్తే కార్మిక సంఘాలు కొంత తగ్గించుకోవాలన్నారు. ఇలా రెండు వర్గాలు ఓ పాయింట్ వద్ద ఫైనల్ చేసుకుని సమస్యను పరిష్కరించుకోవాలన్నారు.ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, నిర్మాతలు సుప్రియ, జెమిని కిరణ్, దామోదర్ ప్రసాద్‌లతో కలిసి మంత్రిని కలిశారు. టాలీవుడ్‌లోని తాజా పరిణామాలపై చర్చించారు. మంత్రి, నిర్మాతలు, ఫెడరేషన్ ప్రతినిధులు ఒకరి ఇబ్బందులను ఒకరు అర్థం చేసుకోవాలని, సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. మంగళవారం మరోసారి చర్చలు జరపాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని దిల్ రాజుకు సూచించారు.మంగళవారం మరోసారి రెండు వర్గాల మధ్య చర్చలు జరిగే అవకాశం ఉంది. ఈ చర్చలకు మంతి కోమటిరెడ్డి కూడా వస్తారని ఫెడరేషన్ ఛైర్మన్ వల్లభనేని అనిల్ అంటున్నారు. షూటింగులు ఆగిపోవడంతో సినీ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ రోజూ పని దక్కడం కష్టమని ఇప్పుడు సమ్మె వల్ల ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోతున్నారు. నిర్మాతలు వేతనాలు పెంచితే తాము ఇక సినిమాలు తీయలేమని చెబుతున్నారు. ఫెడరేషన్ నాయకుల వల్లే సమస్యలు వస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ఫెడరేషన్ల నాయకత్వాలు లక్షలకు లక్షలు వసూలు చేసి కార్డులు ఇస్తున్నాయని తాము ప్రతిభ ఉన్న వారినే షూటింగుల్లో పెట్టుకుంటామని అంటున్నారు. ఇలాంటి సమస్యతో చర్చలు ముందుకు సాగడం లేదు. మంత్రి కోమటిరెడ్డి కల్పించుకోవడంతో మంగళవారం అయినా సమస్యకు పరిష్కారం వస్తుందని ఆశిస్తున్నారు.

# హైడ్రా సిబ్బందికి శుభవార్త

ఆయన స్పష్టం చేశారు.

### జీతాలు పెంచేందుకు పరిశీలన

జీతాలు తగ్గకపోవడమే కాదు, వాటిని పెంచేందుకు ఉన్న అవకాశాలను కూడా పరిశీలిస్తున్నామని కమిషనర్ తెలిపారు. ప్రభుత్వం కూడా ఈ ఆలోచనలోనే ఉందని ఆయన చెప్పారు. పక్క రాష్ట్రాల్లో హైడ్రా సిబ్బందికి చెల్లిస్తున్న జీతాలను కూడా అధ్యయనం చేసి, మెరుగైన విధానాలను అమలు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

### సేవలకు ఎలాంటి ఆటంకం లేదు

కొంతమంది విధులకు గైర్హాజరయ్యారనే వార్తలు వచ్చినా, ఎక్కడా ఎలాంటి సేవలకు ఆటంకం ఏర్పడలేదని కమిషనర్ స్పష్టం చేశారు. హైడ్రా అంటే ప్రజల్లో ఎంతో నమ్మకం ఉందని, దానికి అనుగుణంగా అందరూ కష్టపడి పని చేస్తున్నారని ఆయన ప్రశంసించారు. ఆర్మీలో పనిచేసి వచ్చిన మార్షల్‌ల సేవలను హైడ్రా పూర్తి విశ్వాసంతో చూస్తోందని ఆయన అన్నారు. ఈ వివరణతో హైడ్రా సిబ్బందికి, ప్రజలకు ఒక స్పష్టత లభించింది.

# సీఎం రేవంత్ రెడ్డికి భారీ ఊరట

## – ఆ కేసును కొట్టేసిన హైకోర్టు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సీఎం రేవంత్ రెడ్డికి ఇటీవల చట్టపరమైన అంశాల్లో ఊరట లభిస్తోంది. ఆయనపై నమోదైన పలు రకాల కేసులను న్యాయస్థానాలు కొట్టేస్తున్నాయి. తాజాగా తెలంగాణ హైకోర్టు అతనిపై నమోదైన కేసును కొట్టేస్తూ తీర్పు ఇచ్చింది తెలంగాణ హైకోర్టు. 2019లో జరిగిన ఎన్నికల సమయంలో సూర్యాపేట జిల్లాలోని గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో రేవంత్ రెడ్డిపై ఒక కేసు నమోదైంది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆరోపణలు వచ్చిన ఈ కేసును కొట్టివేయాలని రేవంత్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ కె. లక్ష్మణ్, ఈ కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చారు. ఈ నిర్ణయం రేవంత్ రెడ్డికి ఊరట కల్పించింది. గతంలో కూడా సీఎం రేవంత్ రెడ్డిపై నమోదైన రెండు కేసులు న్యాయస్థానం కొట్టి వేసింది. నల్గొండలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు కౌడిపల్లి పీఎస్‌లలో మరో కేసు నమోదయ్యాయి. వాటిని రద్దు చేస్తూ నెల రోజుల క్రితం కోర్టు తీర్పు ఇచ్చింది. 2021లో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించిన ఆందోళనల్లో ఆయనపై నమోదైన రెండు కేసులను నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు కొట్టివేసింది. జులై 26న స్వయంగా విచారణకు హాజరైన ముఖ్యమంత్రి, తన తరపు న్యాయవాదుల వాదనలతో కోర్టును సంతృప్తి పరిచారు. అన్ని సాక్ష్యాలను పరిశీలించిన తర్వాత, న్యాయస్థానం ఈ కేసులను రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. తాజాగా ఈ తీర్పుతో రేవంత్ రెడ్డికి చట్టపరమైన ఇబ్బందులు దాదాపు తొలగిపోయానే చెప్పాలి.

### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు..

అదేవిధంగా రేవంత్ రెడ్డిపై దాఖలైన మరో కేసులో సుప్రీంకోర్టు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో రేవంత్ రెడ్డిపై పిటిషన్ వేసిన వ్యక్తి పెద్దిరాజుకు సుప్రీంకోర్టు అక్షింతలు వేసింది. ఈ కేసును గతంలోనే తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. కానీ, పెద్దిరాజు ఈ కేసును నాగ్‌పూర్ బెంచ్‌కు బదిలీ చేయాలని సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంతో, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. న్యాయమూర్తికి క్షమాపణలు చెప్పాలని, వారం రోజుల్లో అఫిడవిట్ సమర్పించాలని పెద్దిరాజును ఆదేశించింది. ఈ పరిణామం రేవంత్ రెడ్డికి పరోక్షంగా సానుకూలంగా మారింది. మొత్తంగా ఈ తీర్పులు, వ్యాఖ్యలు రేవంత్ రెడ్డికి చట్టపరంగా లభించిన విజయాన్ని సూచిస్తున్నాయి. తెలంగాణలో ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలను సజావుగా నిర్వహించడానికి ఈ క్లీన్‌చిట్ దోహదపడుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ చట్టపరమైన చిక్కుల నుంచి బయటపడటంతో, రేవంత్ రెడ్డి పూర్తిస్థాయిలో పాలనపై దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది.

## తెలంగాణలోని ములుగు జిల్లాలో

# ఐటీ కంపెనీ

ఉంటుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఐటీ రంగాన్ని ఇతర జిల్లాలకు కూడా విస్తరించే అవకాశం ఎక్కువగా ఉంది. గతంలో హైదరాబాద్‌లోనే ఐటీ కంపెనీలు ఉండేవి. ఇప్పుడు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం వంటి నగరాలకు కూడా వచ్చాయి. ములుగులో ఐటీ కంపెనీ రాకతో ఆ జిల్లా కూడా ఐటీ మ్యాప్‌లో చేరింది.

నిర్భయ పథకం కింద దేశంలో ఎంపికైన 10 జిల్లాలలో ములుగు కూడా ఉందన్నారు. ఇప్పటివరకు హైదరాబాద్, వరంగల్ వంటి నగరాలకే పరిమితమైన ఐటీ రంగాన్ని ములుగు వంటి మారుమూల ప్రాంతాలకు విస్తరించడం ఒక గొప్ప చర్యగా చెప్పుకోవచ్చు.అంతేకాకుండా ములుగు జిల్లా మంజీరా ప్రాంతంలో ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ ఫామ్ సాగుతో రైతులకు మంచి లాభాలు వస్తాయన్నారు.

ప్రభుత్వం సబ్సిడీతో ఒక్కో మొక్కను రూ. 25కే అందిస్తోందని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగుకు ఉన్న గ్యారంటీ మరే పంటకు ఉండదని మంత్రి అన్నారు. ఆయిల్ ఫామ్ సాగుకు ఉన్న గ్యారంటీ మరే పంటకు ఉండదని, 10 ఎకరాలు ఉన్న రైతులు కనీసం 5 ఎకరాలలో ఈ పంటను పండించాలని ఆమె అన్నారు.ఇదిలా ఉండగా మహిళలకు వడ్డీలేని రుణాలు ఇస్తామని నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని మంత్రి సీతక్క తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయ రంగంలో తనకున్న అనుభవాన్ని పంచుకున్నారు. ములుగులో పర్యాటకాభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తామని, కర్రెగుట్టను టూరిజం హబ్‌గా మారుస్తామని చెప్పారు.

## ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన డిఎస్పి రఘుచందర్

**-పాల్గొన్న టౌన్ సిఐ కరుణాకర్**



**జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్)** జగిత్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ను జగిత్యాల డిఎస్పి రఘుచందర్ వార్షిక తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు.ఈ తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణను, రికార్డ్స్ ను పరిశీలించారని తెలిపారు.ఈ వార్షిక తనిఖీలో జగిత్యాల టౌన్ సిఐ కరుణాకర్ పాల్గొన్నారు. దీనిలో భాగంగా ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్, వారి యొక్క సిబ్బందికి ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో పాటించవలసిన జాగ్రత్తలను, ట్రాఫిక్ పాయింట్ల యందు తీసుకోవలసిన జాగ్రత్తలు,విజిబుల్ పోలీసింగ్ సంబంధించిన పలు సూచనలు చేశారని తెలిపారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి సత్వర న్యాయం : ఎస్పీ అశోక్ కుమార్

**– ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే**



**జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)** ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 15 మంది అర్జీదారులతో ఎస్పీ స్వయంగా కలసి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఫిర్యాదుల పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ డే లో వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతో పాటు పెండింగులో లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు

## రైతు భీమా పథకం

# రెన్యువల్ ఆగస్టు 14న ప్రారంభం

**- 18 - 59 ఏళ్ల రైతులకు వర్తింపు**

**- మండల వ్యవసాయ అధికారి : కె. ప్రణీత**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భీమా పథకం 2025 పాలసీ సంవత్సరం ఈ ఆగస్టు 14, 2025న రెన్యువల్ కానుందని బోయినిపల్లి మండల వ్యవసాయ అధికారి కె. ప్రణీత సోమవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 5, 2025 వరకు భూభారతి పోర్టల్‌లో నమోదైన 18 నుండి 59 సంవత్సరాల వయస్సు గల రైతులు ఈ పథకానికి అర్హులు.

### కొత్త రిజిస్ట్రేషన్లు - 366 మంది రైతులు

బోయినిపల్లి మండలంలో గత సంవత్సరం కాలంలో (జూన్ 5, 2025 వరకు) కొత్తగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు 366 మంది ఉన్నారని తెలిపారు.

### తప్పనిసరిగా సమర్పించాల్సిన పత్రాలు

రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్,ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు, రైతు భీమా ఫారంతో కలిసి ఆగస్టు 13, 2025లోగా సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారికి ఇవ్వాలి.

### ఇప్పటికే రిజిస్టర్ అయిన వారికి గడువు

గత సంవత్సరం రైతు భీమా పథకంలో ఇప్పటికే రిజిస్టర్ అయిన రైతులు ఏవైనా మార్పులు లేదా చేర్పులు ఉంటే, అవి ఆగస్టు 12, 2025లోగా సమర్పించాలని మండల వ్యవసాయ అధికారి కె. ప్రణీత రైతులను కోరారు.

## నేడు హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా శతవార హనుమాన్ చాలీసా యజ్ఞం

**- భక్తుల హనుమాన్ చాలీసా స్మరణతో మార్మోగనున్న వేములవాడ పట్టణం**

**- భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలి**

**- హిందూ ఉత్సవ సమితి సభ్యులు : మోటూరి మధు, గడప కిషోర్ రావు**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** శ్రీ ఆంజనేయ స్వామి భక్తుల భక్తి తరంగాలతో వేములవాడ పట్టణం మరోసారి మార్మోగబోతోంది. శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతీ మంగళవారం జరుగుతున్న హనుమాన్ చాలీసా పారాయణం 99 వారాలు విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా నేటి మంగళవారం (ఆగస్టు 12) 100వ వార యజ్ఞ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు హిందూ ఉత్సవ సమితి సభ్యులు మోటూరి మధు, గడప కిషోర్ రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఉదయం 8 గంటలకు శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం వరకు నగర సంకీర్తన నిర్వహించడం,అనంతరం ఆలయ ప్రాంగణంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరగనుంది.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ ఆంజనేయ స్వామి కృపకు పాత్రులవ్వాలని హిందూ ఉత్సవ సమితి సభ్యులు మోటూరి మధు, గడప కిషోర్ రావు పిలుపునిచ్చారు. మహోత్సవం అనంతరం మహా ప్రసాద వితరణ జరగనుందని విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రజావాణి అర్జీలపై సత్వర చర్యలు

ఆదిలాబాద్, ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అర్జీలను పరిశీలించిన ఆయన, వాటి పరిష్కారానికి అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి కూడా పాల్గొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు.

## శ్రీపాద ఎల్లంపల్లికి పెరిగిన వరద ప్రవాహం

బోథ్, శ్రీపాద ఎల్లంపల్లి జలాశయానికి వరద ప్రవాహం గణనీయంగా పెరిగింది. పరివాహక ప్రాంతాల్లో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాత్రి నాటికి జలాశయంలోకి 6628 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం, జలాశయం నుండి హైదరాబాద్ నగరానికి తాగునీటి అవసరాల కోసం 285 క్యూసెక్కులు, ఎన్టిపిసికి 121 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

## నిరుద్యోగుల కోసం జాబ్ మేళా

ఖానాపూర్, జన్నారం ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ బండి రాములు మాట్లాడుతూ, నిరుద్యోగుల మేలు కోసమే జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం కళాశాలలో జరిగిన జాబ్ మేళాలో పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొని, ఐటిఐ పూర్తి చేసిన నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పలు కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

### వాతావరణ మార్పులతో
## కాగజ్‌నగర్ ప్రజలు ఇక్కట్లు

ముథోల్, కాగజ్‌నగర్ పట్టణంలో వాతావరణ మార్పులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఒక పూట వర్షం, మరో పూట ఎండ, ఉక్కపోత, చల్లని వాతావరణం కలగలిసి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనితో అనారోగ్యం పాలవుతున్నారు. వర్షాకాలంలో కూడా ఇలాంటి వేడిని ఎప్పుడూ చూడలేదని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

సిరిసిల్ల, రాజన్న సిరిసిల్ల జిల్లాలో యూరియా కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. వారం రోజుల నుంచి యూరియా కోసం అవస్థలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రైవేటు వ్యాపారులు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారని మండిపడుతున్నారు. కరీంనగర్ జిల్లాలో యూరియా కోసం రైతుల రోడ్డెక్కారు.

## రాజన్న గుడిలో రుద్రాభిషేక పూజలు..

వేములవాడ, శ్రావణమాస మూడవ సోమవారం సందర్భంగా రాజన్న గుడిలో శ్రీరాజరాజేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేక పూజలు అర్చక స్వాములు, వేద పండితులు వేదోక్తంగా నిర్వహించారు. సాయంత్రం భీమేశ్వర ఆలయంలో మహాలింగార్చన పూజ కార్యక్రమాలు ఉంటాయని అర్చక స్వాములు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి.

### మార్గండేయ మందిరానికి
## రూ. 1.51 లక్షల విరాళం



జగిత్యాల, జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో శివ భక్తమార్కండేయ మందిర నిర్మాణానికి ద్యావనపెల్లి కార్తీక్ రాజారాం రూ. 1,51,000 నవగ్రహ మండపం కోసం విరాళంగా ఇచ్చి సభ్యత్వం పొందారు. ఈ సందర్భంగా పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాజారాం మాట్లాడుతూ.. వీరికి, వీరి కుటుంబ సభ్యులకు శ్రీ శివభక్త మార్కండేయ స్వామి, శ్రీ లక్ష్మీ గణపతి స్వామి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.

## మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్‌కి ఘన సన్మానం



కోరుట్ల, మెట్పల్లిలో రాజ్యాంగంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి బి. చంద్రకుమార్‌ను 'సుఖీభవ' సంస్థ సభ్యులు సోమవారం సన్మానించారు. అలాగే, విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం, కార్పెంటర్ వర్కర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన కొండమురళి కుమారుడిని అభినందించారు. ఈ సదస్సులో బొక్కెనపల్లి నాగరాజు, మ్యాడపు అశోక్ పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులను కలుపుకుపోతేనే రాజకీయ విజయం



సత్తుపల్లి, సత్తుపల్లిలో జరిగిన ఆర్యవైశ్య సంఘ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చంద్రరావు మాట్లాడుతూ, అన్ని రాజకీయ పార్టీలు ఆర్యవైశ్యులను కలుపుకుపోతేనే రాజకీయాల్లో విజయం సాధించవచ్చని కోరారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షులు వందనపు సత్యనారాయణ, సోమిశెట్టి శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వనమా కిరణ్, గంగిశెట్టి జగదీష్, సిహెచ్ లక్ష్మి వెంకటనర్సిహారావు పాల్గొన్నారు.

## మెట్పల్లి మార్కెట్ గోదాము అగ్నిప్రమాదం

ధర్మపురి, జగిత్యాల జిల్లా మెట్పల్లి వ్యవసాయ మార్కెట్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయిన గోదామును జిల్లా కలెక్టర్ సోమవారం పరిశీలించారు. అగ్నిప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆర్డీవో శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు జువ్వడి కృష్ణారావు, వ్యవసాయ మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు బీమాకు దరఖాస్తు గడువు పొడిగింపు

పాలేరు, ఏన్కూరు మండలంలో రైతు బీమా పథకానికి అర్హులైన రైతులు ఈ నెల 13వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ నరసింహారావు తెలిపారు. జూన్ 5 వరకు కొత్తగా పట్టా పాసుపుస్తకాలు పొందిన రైతులు, గతంలో నమోదు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సున్న రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు కాపీలను రైతు వేదికలో సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.

### గాజాపై ఇజ్రాయిల్ దాడులకు
## బీజేపీ మద్దతు అన్యాయం

ఖమ్మం, గాజాపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను ఖమ్మంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఖండించారు. సోమవారం గిరిప్రసాద్ భవనంలో జరిగిన సమావేశంలో ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, జి. మస్తాన్ మాట్లాడుతూ, ఈ దాడులకు బీజేపీ మద్దతు ఇవ్వడం సిగ్గుచేటని అన్నారు. గాజాలో జరుగుతున్న మారణకాండను ప్రపంచం మొత్తం వ్యతిరేకిస్తుందని, లక్షలాది మంది ప్రజలు నిరసనలు తెలుపుతున్నారని తెలిపారు.

## పుస్కూరి శ్రీనివాస్ రావు మానవత్వం



పాలకుర్తి, జనగామ జిల్లా తాజా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పుస్కూరి శ్రీనివాస్ రావు, తన జన్మదినం సందర్భంగా సోమవారం జఫర్ గడ్ మండలం సాగరం గ్రామంలోని మన ఇల్లు అనాథ ఆశ్రమాన్ని సందర్శించారు. అక్కడ గాదె ఇన్నయ్య స్థాపించిన అనాథ పిల్లల కోసం ఆర్థిక సహాయం, పండ్లు పంపిణీ చేసి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. పాలకుర్తికి చెందిన శ్రీనివాస్ రావు ఈ సేవా కార్యక్రమం ద్వారా పలువురి ప్రశంసలు పొందారు.

## ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

జనగామ, జనగామ జిల్లా కొడకండ్ల మండల రైతువేదికలో సోమవారం, ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగుతోందని అన్నారు. లబ్ధిదారులు, ఇంద్రమ్మ కమిటీ సభ్యులు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మధుసూదనచారి ఉద్యానవనంలో మార్నింగ్ వాక్

భూపాలపల్లి, భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఆచార్య జయశంకర్ ఉద్యానవనంలో శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనచారి సోమవారం ఉదయం మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా ఆయన నగరవాసులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురిని ఆప్యాయంగా పలకరించిన ఆయన, పట్టణ ప్రజల సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరకాలలో కాంగ్రెస్ కీలక సమావేశం

పరకాల, హన్మకొండ జిల్లా పరకాలలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యులు సంపత్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ద్వారానే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందని, కాబట్టి ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు.

## చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్టాపన భూమి పూజ

నర్సంపేట, వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని హై స్కూల్ సెంటర్‌లో రజక సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన వీరనారి, తొలి దశ తెలంగాణ ఉద్యమకారిణి చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి సోమవారం పిసిసి సభ్యులు సొంత రెడ్డి రంజిత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భక్కిఅశోక్, డిసిసి ప్రధాన కార్యదర్శి పెండ్యాల హరిప్రసాద్ కూడా పాల్గొన్నారు.

## రామలింగేశ్వర స్వామికి శ్రావణ మాసం ప్రత్యేక పూజలు

నర్సాపూర్, తూప్రాన్ మండలం జేజపట్నం (ఇస్లాంపూర్) శివారులోని రామప్ప గుట్టపై వెలసిన స్వయంభు శ్రీ భవాని రామలింగేశ్వర స్వామివారికి శ్రావణ మాసం సోమవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. పూజారి శలాక ఆత్రేయ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన వంటి శాస్త్రోక్త పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు.

### రహదారి లేక గర్భిణీ ప్రసవం..
## 2 కి.మీ. మోసిన కుటుంబం!

సంగారెడ్డి, సంగారెడ్డి జిల్లా నాగిల్‌గిద్ద మండలం మున్యా నాయక్ తండాలో రహదారి లేకపోవడంతో గర్భిణీకి తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. అంబులెన్స్ గ్రామానికి చేరకపోవడంతో, ఆశా వర్కర్లు, కుటుంబ సభ్యులు ఆమెను 2 కి.మీ. భుజాలపై మోసుకెళ్లారు. మార్గంలోనే ఆడశిశువు జన్మించింది. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యమేనని జిఎంఆర్ టీం ఆరోపించింది. రోడ్లు, వైద్యం, విద్య, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

## ఆగష్టు 13 లోగా దరఖాస్తు గడువు

హుస్నాబాద్, హుస్నాబాద్/అక్కన్నపేట మండలంలో కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు పొందిన, గతంలో రైతు బీమా చేసుకోని రైతులు ఆగష్టు 13 లోగా రామవరం రైతు వేదికలో దరఖాస్తు చేసుకోవాలి. 2025 జూన్ 5 నాటికి భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న, 18-59 ఏళ్ల మధ్య వయస్సు గల, ఆగష్టు 14, 1966 నుండి ఆగష్టు 14, 2007 మధ్య జన్మించిన రైతులు అర్హులు. రైతు మరణిస్తే కుటుంబానికి రూ.5 లక్షల బీమా అందుతుంది. గతంలో బీమా పొందినవారు నామినీలను మార్చుకోవచ్చు.

### రోడ్డు నిబంధనలు అతిక్రమించిన
## 501 మందిపై కేసులు నమోదు

సిద్దిపేట, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు వాహనదారుల సహకారం అవసరమని, పోలీసు కమిషనర్ అనూరాధ తెలిపారు. రాత్రి రాజీవ్ రహదారిపై నిర్వహించిన వాహనాల తనిఖీల్లో మద్యం సేవించి నడిపిన 76 మంది, నిబంధనలు పాటించని 425 మందిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని ఆమె సూచించారు.

### ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు
## యూనిఫామ్‌లు పంపిణీ

గజ్వేల్, గజ్వేల్ మండలం మల్లారెడ్డిపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం స్వామి వివేకానంద సేవా సమితి, గజ్వేల్ ఆధ్వర్యంలో యూనిఫామ్ లు అందజేశారు. మానవ సేవే మాధవ సేవగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే విద్యార్థులకు యూనిఫామ్ లు పంపిణీ చేశామని సమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, మహేందర్, సచిన్, అబ్దుల్లా కరీం, హరీష్ రెడ్డి, చేపూరి సంతోష్, కైలాస ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జోగిపేటలో మురికి నీరు..
### అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీలో పెరుగుతున్న సమస్యలపై ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాముకాటు, డెంగ్యూతో ఇద్దరు చిన్నారుల మృతి, మురుగు నీరు రోడ్లపైకి వచ్చి దుర్గంధం వెదజల్లడం వంటి ఘటనలతో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. వ్యాపారస్తులు, ప్రజలు ఇప్పటికైనా అధికారులు స్పందించి, పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేయించి, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## బీసీలకు 42% రిజర్వేషన్లు

పటాన్‌చెరు, : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధం చేయాలని, పార్లమెంటులో రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని సీపీఎం పటాన్ చెరువు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో పటాన్ చెరువులో నిరసన చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని బీసీల హక్కుల కోసం తమ గళం వినిపించారు. ఈ డిమాండ్ వెనుక బీసీల సంక్షేమం మరియు సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యం ఉంది.

## అచ్చంపేటలో మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటన

అచ్చంపేట, : అచ్చంపేట పట్టణంలో సోమవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరై, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి శంకుస్థాపన చేయనున్నారు. మంత్రి పర్యటనను పురస్కరించుకుని అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మున్సిపల్ ఛైర్మన్ శ్రీనివాస్ ఈ వివరాలను తెలిపారు.

## జడ్చర్ల రంగనాయక స్వామి ఆలయంలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ప్రత్యేక పూజలు



జడ్చర్ల, : శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా జడ్చర్ల నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ రంగనాయక స్వామి దేవాలయాన్ని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. జడ్చర్లను ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

### ఇందిరమ్మ ఆత్మీయ భరోసా
## వెంటనే అమలు చేయాలి

నిజామాబాద్ రూరల్, ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను వెంటనే అమలు చేయాలని, వ్యవసాయ కార్మికుల పట్ల ప్రభుత్వ వివక్షను ఆపాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ. రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం సిరికొండ మండలంలోని రావుట్ల గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు అఖిలభారత కార్మిక సంఘం సిరికొండ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## బోధన్ దర్గాలో ఉర్సు ఉత్సవాలు ప్రారంభం

బోధన్,బోధన్ పట్టణంలోని పురాతన హజ్రత్ సయ్యద్ శా జలాల్ బుఖారీ దర్గాలో రాత్రి ఉర్సు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దర్గాకు వచ్చే రహదారిలో ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలను ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు ఫయాజుద్దీన్, పట్టణ అధ్యక్షుడు మీర్ ఇలియాజ్ అలీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు అహ్మద్ బిన్ మోసిన్, హాజీ బిల్డర్ తదితరులు ప్రారంభించారు. ఈ ఉత్సవాలు దర్గా చరిత్రలో భాగంగా ఘనంగా జరుగుతున్నాయి.

## బీబీపేట పెద్ద చెరువుల నీటిమట్టం: రైతుల్లో ఆనందం

కామారెడ్డి, బీబీపేట పెద్ద చెరువుల్లో నీటిమట్టం పెరగడంతో బోలురు పంటలకు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరో టిఎంసి నీరు వస్తే చెరువు పూర్తిగా నిండి, యాసాంగి పంటలకు కూడా మేలు జరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు. ఈ చెరువు ఏడు గ్రామాలకు నీటిని అందిస్తుండటంతో, దీనిపైనే అందరూ ఆధారపడి ఉన్నారు. ఈ చెరువు ఎండిపోకుండా, పంటలు బాగా పండాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

# రాజన్న ఆలయంలో అవినీతి రహిత దిశగా ఈఓ క్షేత్రస్థాయి తనిఖీలు

**– ఆదివారం రాత్రి ఆలయ వసతి గదులపై ఈఓ రాధాబాయి ఆకస్మిక తనిఖీ**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన భీమేశ్వర సదన్ వసతి గదుల సముదాయం, జాతర గ్రౌండ్‌లోని గదుల విచారణ కార్యాలయం,ఇతర ధర్మశాలలలో ఆదివారం రాత్రి దేవస్థానం ఈఓ రాధాబాయి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా గదులకు సంబంధించిన డైలీ కలెక్షన్ రిపోర్ట్ (డీసీఆర్) రశీదులు, భక్తులకు కేటాయించిన గదుల వివరాలు,ఈ%–%టికెటింగ్ ద్వారా రశీదులు జారీ చేసే విధానం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు.ఇటీవలి కాలంలో ఆలయంలోని పలు విభాగాలను తరచూ క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తూ, సిబ్బంది ఎక్కడా పొరపాట్లు చేయకుండా అవినీతి రహిత వాతావరణం నెలకొల్పే దిశగా ఈఓ రాధాభాయి చేస్తున్న కృషిని పలువురు భక్తులు, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఈఓ రాధాబాయి ని అభినందిస్తున్నారు.ఈ తనిఖీలో వసతి గదుల విభాగ సహాయ కార్యనిర్వహణాధికారి జి. అశోక్, పరిశీలకులు పి. వంశీ మోహన్,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కృష్ణవేణి స్కూల్లో విద్యార్థులకు “ఆల్బెండజోల్” మాత్రలు పంపిణీ



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణంలోని కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం 1–19 సంవత్సరాల లోపు వయస్సు గల విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన “ఆల్బెండజోల్” (నులిపురుగుల మందు) మాత్రలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సన్నిధి వెంకట కృష్ణ మాట్లాడుతూ, “పిల్లల ఆరోగ్యానికి శుభ్రమైన ఆహారం,పరిశుభ్రమైన తాగునీరు,క్రమానుగత ఆరోగ్య పరీక్షలు చాలా అవసరం. నులిపురుగుల నివారణకు ప్రభుత్వం పంపిణీ చేసిన మాత్రలను తప్పనిసరిగా తీసుకోవాలి” అని సూచించారు.ఈ కార్యక్రమానికి ప్రాంతీయ ఆశా వర్కర్ రేఖ హాజరై విద్యార్థులకు మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి


**– సాగునీటి ప్రాజెక్టులపై అధికారులతో ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సోమవారం హైదరాబాద్‌లో అధికారులతో సమీక్షించారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు సమావేశంలో ఆయన పాల్గొన్నారు.కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్ కుడి–ఎడమ కాల్వలు, మల్కాపేట రిజర్వాయర్ ఎడమ కాల్వ భూసేకరణ, మర్రిపల్లి ప్రాజెక్టు, లచ్చాపేట తండా రిజర్వాయర్ కాల్వ పనులు, ఆశిరెడ్డిపల్లి కొచ్చేరు, సనుగుల ఎర్ర చెరువు, పటేల్ చెరువులకు నీటినింపే ఏర్పాట్లపై చర్చ జరిగింది.రైతులకు సకాలంలో సాగునీరు అందించడమే లక్ష్యమని, ఇందుకోసం ప్రాజెక్టు పనులను నాణ్యతతో పూర్తి చేయాలని ఆది శ్రీనివాస్ సూచించారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపు,మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో సీఈ సుధాకర్ రెడ్డి, ఈఈ సంతు ప్రకాష్‌తో పాటు తదితర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# యూరియా కొరత పుకార్లను నమ్మొద్దు – రైతులెవరూ ఆందోళన చెందొద్దు

**– జిల్లా వ్యవసాయ అధికారి : అఫ్జల్ బేగం**



**సిరిసిల్ల/ వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లాలో యూరియా కొరత ఎక్కడా లేదని, కొరత ఉందన్న పుకార్లను రైతులు నమ్మవద్దని జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం సోమవారం స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సీజన్ అవసరాలకు సరిపడా యూరియా నిల్వ అందుబాటులో ఉందని, ప్రతిరోజూ సహకార సంఘాలు, ఐకెపి సెంటర్ల ద్వారా సరఫరా కొనసాగుతోందని తెలిపారు.ట్రాన్స్పోర్ట్‌లో ఒకటి రెండు రోజుల ఆలస్యం జరిగినా, యూరియా కొరత సమస్య లేదని అన్నారు. ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యవేక్షణలో యూరియా సమృద్ధిగా రైతులకు అందేలా చర్యలు తీసుకున్నారని వివరించారు.ఈ నేపథ్యంలో రైతు సోదరులు ఎటువంటి ఆందోళన లేకుండా పంటపనులు సాగించవచ్చని సూచించారు.

# వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట...

**–జిల్లాలో 4 సహకార సంఘాలకు సోలార్ ప్లాంట్ల కేటాయింపు**

**– 1మెగా వాట్ సోలార్ ప్లాంట్ కు శంకుస్థాపన**

**– ఐటి, పరిశ్రమలు,శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**



మంథని ( ప్రశ్న న్యూస్)వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఐటి, పరిశ్రమలు,శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం మండలంలోని గుంజపడుగు గ్రామ శివారులో పిఏసిఎస్ మంథని అద్వర్యంలో పిఎం కుసుమ్ ద్వారా రూ.3.50కోట్లతో ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్ కు ఐటి, పరిశ్రమలు,శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నాఫ్స్కాబ్, కెడిసిసి కరీంనగర్ జిల్లా బ్యాంకు చైర్మన్ కొండూరి రవీందర్ రావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, కెడిసిసి కరీంనగర్ జిల్లా సిఈఓ సత్యనారాయణ రావు, డిసిఓ శ్రీమాల, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఐటి, పరిశ్రమలు,శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో కలెక్టర్ ప్రత్యేక చోరువతో మంథని, కాల్వ శ్రీరామ్ పూర్,అప్పన్నపేట, నందిమేడారం సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం సోలార్ ప్లాంట్లు మంజూరు చేసిందని అన్నారు. నాలుగు నెల్లల్లో సోలార్ ప్లాంట్ పరికరాలు ఇన్ స్టాలేషన్ చేసి పవర్ గ్రిడ్ కు కనెక్షన్ ఇచ్చి విద్యుత్ ఉత్పత్తి జరుపాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ప్రణాళిక బద్ధ%శీ%గా ముందుకు సాగుతుందని అన్నారు. ప్రభుత్వానికి, రైతులకు సహకార సంఘాలు వారధిగా నిలుస్తున్నాయని అన్నారు. గుంజపడుగ ప్రాతంలో సహకార బ్యాంకు ఏర్పాటు చేయాలని పలువురు మంత్రి కి వినతి పత్రం సమర్పించారు. రైతులకు రైతు భరోసా, సన్న వడ్లకు రూ.500 బోనసు, అందజేస్తున్నామని తెలిపారు. నాఫ్స్కాబ్, కెడిసిసి కరీంనగర్ జిల్లా బ్యాంకు చైర్మన్ కొండూరి రవీందర్ రావు మాట్లాడుతూ దేశం లోనే సహకార సంఘాలు దిక్సూచిగా నిలుస్తున్నాయని, ఆకాశమే హద్దుగా ఏ వ్యాపారమైనా సహకార సంఘాల ద్వారా చేయవచ్చని అన్నారు. మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ, గుంజపడుగు శివారులో 1 మెగా వాట్ సోలార్ ప్లాంట్ కు 4 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించిన మంత్రి శ్రీధర్ బాబు, కలెక్టర్, డిసిఓకు కృతజ్ఞతలు తెలిపారు. గుంజపడుగు,చిల్లపల్లి శివారులో వేర్ హౌస్ గోదా%శీ%ల నిర్మానానికి శ్రీకారం చుట్టిన శ్రీధర్ బాబు కృషి చాలా గొప్పదని అన్నారు. నాగారం గ్రామ శివారులో సంఘం ద్వారా రైస్ మిల్ నిర్మాణానికి నాబార్డ్, కెడిసిసి బ్యాంకు ద్వారా నిధులు మంజూరు ఇప్పించాలని కోరారు.ముందుగా శ్రీధర్ బాబు కు ఘన స్వాగతం పలికారు. సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మంత్రి శ్రీధర్ బాబుకు గజమాల వేసి టోపీ బహుకరించారు. ఈకార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు బెల్లంకొండ ప్రకాష్ రెడ్డి, డైరెక్టర్లు పెద్దిరాజు ప్రభాకర్, రావికంటి సతీష్ కుమార్, సిరిమర్తి ఓదెలు, లెక్కల కిషన్ రెడ్డి, కొత్త శ్రీనివాస్,దాసరి లక్ష్మి – మొండయ్య, ఉడుత మాధవి– పర్వతాలు యాదవ్, దేవల్ల విజయ్ కుమార్, టీజీఇఆర్సి సలహాదారు శశిభూషణ్ కాచే, ఆర్ టిఐ మెంబర్ మంథని సురేష్, ఆర్డిఓ సురేష్, ఆర్జీ–1 జిఎం లలిత్ కుమార్, గ్రంధాలయ సంస్త చైర్మన్ అన్నయ్య గౌడ్, ఎఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న, మండల పార్టీ ఆద్యక్షుడు అయిలి ప్రసాద్, నాయకులు తొట్ల తిరుపతి, ముస్కుల సురేందర్ రెడ్డి, పెండ్లి రమ–సురేష్ రెడ్డి, శ్రీరా%శీ%బట్ల శ్రీనివాస్, అజీంఖాన్, బందారపు చంద్రయ్య, సాదుల శ్రీకాంత్, గుమ్మడి రాజయ్య, కొమ్ము పద్మ–సమ్మయ్య, బూడిద శంకర్, మంథని సత్యనారాయణ, ఇందారపు అనిల్, ఉదరి శంకర్, లచ్చన్న, ఆకుల కిరణ్, ఎరుకల ప్రవీణ్, బూడిద మల్లేష్, రాం రాజశేఖర్, సహకార శాఖ సూపరింటే%శీ%డెంట్ శ్రీనివాస్, అసిస్టంట్ రిజిస్ట్రార్ అనిల్, కేడిసిసి ఎజీఎం రాజశేఖర్, మేనేజర్ ఉదయశ్రీ, డిఇ శ్రీనివాస్, ఎడిఎ అంజని, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, ఎఎంసి డైరెక్టర్లు, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజా గ్రీవెన్స్ పరిష్కార సమావేశం



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తో కలిసి అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్. శ్రీకాళహస్తిలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిధి గృహంలో స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి తో కలిసి పి జి ఆర్ ఎస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు. ఈ కార్యక్రమానికి భారీగా రైతులు స్థానిక ప్రజలు తరలివచ్చి ప్రజా ప్రతినిధులకు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కార్యక్రమం ప్రారంభోత్సవానికి విచ్చేసినప్పుడు రైతుల వినతి మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సమస్యలు, వివిధ రకాల సమస్యలపై అర్జీలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. పీజీ ఆర్ఎస్ లో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించవలసిందిగా ఆయన ఆదేశించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# సఖి కేంద్ర మహిళల హక్కులపై అవగాహన కల్పించండి కలెక్టర్

**బాధిత మహిళలకు అండగా భరోసా కేంద్రాలు**

**మెదక్ జిల్లా కేంద్రంలో భరోసా, సఖి సెంటర్స్ ను పరిశీలించిన కలెక్టర్ రాహుల్ రాజ్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) సఖి కేంద్రాల ద్వారా మహిళల హక్కుల పై అవగాహన కల్పించాలని,లైంగిక దాడికి గురైన బాధితులకు అండగా భరోసా సెంటర్స్ రక్షణ కల్పిస్తాయని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో గల భరోసా , సఖి సెంటర్స్ ను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ముందుగా భరోసా సెంటర్స్ సందర్శించి లీగల్, మెడికల్, చిన్నారుల, కౌన్సిలింగ్ స్టేట్మెంట్ రికార్డింగ్ చేయు గదులను పరిశీలించి భరోసా సెంటర్ నిర్వాహణ తీరును ఆరా తీశారు . బాధితులకు నైపుణ్యాలు నేర్పించి సమాజంలో ఉన్నతంగా జీవించేలా భరోసా సెంటర్స్ దోహదపడతాయి అన్నారుఅనంతరం సఖి సెంటర్ ను సందర్శించినిర్వహణ తీరును నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. సఖి సెంటర్ ద్వారా ఇప్పటివరకు 1391 కేసులు పెట్టామని 1131 కేసులకు వివిధ రకాల న్యాయ సేవలు అందించినట్లు,నిర్వాహకులు కలెక్టర్ కు వివరించారు.సఖి కేంద్రానికి వచ్చే బాధితులకు భరోసానిచ్చి న్యాయం అందించేలా చూడాలని కలెక్టర్ ఈ సందర్భంగా నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సఖి కేంద్రం నిర్వాహకులు రేణుక, లీగల్ కౌన్సిలర్ నిర్మల, ఐపీ అసిస్టెంట్ ఎన్ రమేష్,మల్టీపర్పస్ వర్కర్ .02 ఉమామహేశ్వరి సిబ్బంది భరోసా సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ పార్వతిపురంలో భారీ శ్వేత నాగుపాము కలకలం - భక్తుల ఆందోళన

**– శాశ్వత స్నేక్ క్యాచర్ ను నియమించాలని భక్తులు, హిందూ సంఘాల విజ్ఞప్తి**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ రాజన్నాలయ వసతి గృహ సముదాయం పార్వతిపురంలో సోమవారం భారీ శ్వేత (తెల్లని) నాగుపాము కనిపించడంతో భక్తులు భయాందోళనలకు గురయ్యారు. ఘటన సమాచారం అందుకున్న ఆలయ సిబ్బంది స్థానిక స్నేక్ క్యాచర్ జగదీష్‌కు సమాచారం అందించారు. గంటపాటు ప్రయత్నించి తెల్లని నాగుపామును అతడు సురక్షితంగా పట్టుకున్నాడు.నాగుపామును చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణంలో పాముల సంచారం పెరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాలు జరగకముందే శాశ్వత స్నేక్ క్యాచర్‌ను నియమించాలని భక్తులు, హిందూ సంఘాలు ఆలయ ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# ఆరోగ్య సేవలపై ప్రజలకు సూచనలు

పుంగనూరు, : పుంగనూరు మండలం సుగాలిమిట్ట గ్రామ హెల్త్ క్లినిక్‌లో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరిగింది. వైద్యాధికారి డా. జి. పవన్ కుమార్ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, పిల్లలకు టీకాల ప్రాముఖ్యతను వివరించారు. బీపీ, మధుమేహ రోగులకు మందులు పంపిణీ చేయబడ్డాయి. రేపు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన సబ్ కలెక్టర్ కళ్యాణి బాధ్యతలు స్వీకరింపు

చిత్తూరు, : ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని మదనపల్లె నూతన సబ్ కలెక్టర్ చల్లాకల్యాణి మంగళవారం తెలిపారు. గతంలో సబ్ కలెక్టర్ గా పనిచేసిన మేఘస్వరూప్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కళ్యాణిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మదనపల్లె నూతన సబ్ కలెక్టర్ గా కళ్యాణి మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు.

# మిథున్ రెడ్డి క్షేమం కోసం బోయకొండ గంగమ్మకు వైసీపీ పూజలు

పుంగనూరు, : చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలోని దిగువపల్లిలో ఉన్న శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో సోమవారం వైసీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లిక్కర్ స్కాం కేసులో అరెస్టై రాజమండ్రి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డి క్షేమంగా, కడిగిన ముత్యంలా బయటకు రావాలని ఈ పూజా కార్యక్రమాలు చేపట్టామని వారు తెలిపారు.

# కమలాపురం నగర పంచాయతీ కమిషనర్‌గా ప్రహల్లాద్

కమలాపురం,: కమలాపురం నగర పంచాయతీ నూతన కమిషనర్‌గా ప్రహల్లాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు కదిరి మున్సిపాలిటీలో శానిటరీ ఇన్స్పెక్టర్‌గా పనిచేసిన ఆయన, పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. గత కమిషనర్ జగన్నాథ్ మడకశిర బదిలీపై వెళ్ళిన నేపథ్యంలో ప్రహల్లాద్ ఈ బాధ్యతలు స్వీకరించారు. కమలాపురం అభివృద్ధికి సిబ్బందితో కలిసి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల వేళ.. అధికారులు, పోలీసులు సన్నద్ధం

పులివెందుల, : పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం అధికారులు, పోలీసులు సన్నద్ధతను ముమ్మరం చేశారు. ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామాగ్రిని కేంద్రాలకు తరలిస్తున్నారు. పోలీసు అధికారులు కూడా పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకుంటున్నారు. దీంతో పులివెందుల పోలీస్ స్టేషన్, ఎంపీడీవో కార్యాలయాలు సందడిగా మారాయి.

# నులిపురుగుల నివారణకు అవగాహన ర్యాలీ

కడప, : పెండ్లిమర్రి మండలం నందిమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, డాక్టర్ చెన్నారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఆరు నెలలకోసారి ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపడుతుంది. ఆగస్టు 12న 2–19 ఏళ్ల పిల్లలకు ఆల్బెండాజోల్ టాబ్లెట్లను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఈ తేదీన టీకా తీసుకోని పిల్లలకు ఆగస్టు 20న మళ్ళీ అందజేస్తారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### శ్రావణ సోమవారం రాజన్నాలయంలో

# భక్తుల ఆధ్యాత్మిక సందడి

- శివనామ స్మరణతో మారుమ్రోగిన వేములవాడ క్షేత్రం
- ఎస్పీఎఫ్ భద్రతా సిబ్బంది,హోం గార్డులు, వాలంటీర్ల సమన్వయంతో సాఫీగా దర్శనం
- 50 వేలకు పైగా భక్తుల దర్శనం
- అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయ ఈఓ : రాధాభాయి





వేములవాడ (ప్రశ్న న్యూస్)పవిత్ర శ్రావణమాసాన్ని పురస్కరించుకొని మూడో సోమవారం రోజున వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం భక్తజనాలతో కళకళలాడింది. తెల్లవారుజామున నుంచే రాష్ట్రం నలుమూలలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. ముందుగా ఆలయానికి సమీపంలోని ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి,శరీర,మనోశుద్ధితో స్వామివారి సన్నిధికి చేరుకున్నారు.భక్తులు స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకుంటూ,ప్రత్యేక పూజలు,కళ్యాణ మహోత్సవం, కుంకుమపూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం అంతా "ఓం నమశ్శివాయ" స్మరణతో మారుమ్రోగింది.సోమవారం స్వామివారికి ఇష్టమైన రోజు అన్న విశ్వాసంతో సుమారు 50 వేలకు పైగా భక్తులు దర్శనం పొందినట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి.భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ ఈఓ రాధాభాయి ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రత్యేక క్యూలైన్లు,తాగునీటి వసతి,సన్‌షెడ్‌లు,హోం గార్డులు,సేవా సమితి,వాలంటీర్ల సమన్వయంతో భక్తులను సౌకర్యవంతంగా దర్శనం పొందేలా చేశారు.అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం నుండి ప్రత్యేక పూజలు,ప్రత్యేక అలంకారం నిర్వహించగా,భక్తులు క్యూలైన్లలో నిల్చొని భక్తిశ్రద్ధలతో స్వామివారి సన్నిధిని చేరుకున్నారు. ఆలయ పరిసరాల్లోని అన్నదాన సత్రంలో భక్తులకు అన్నప్రసాదాలు,పానీయాల వెసులుబాటు కల్పించారు. ఆలయాన్ని దర్శించిన భక్తులు శ్రావణ సోమవారం రోజున రాజన్నను దర్శించడం జీవితంలో గొప్ప పుణ్యం అని భావిస్తూ ఆనందం వ్యక్తం చేశారు.

## ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందేలా ఉపాధ్యాయులు కృషి చెయ్యాలి.

**మంథని మండలం చిల్లపల్లి గ్రామంలో అప్పర్ ప్రైమరీ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్.**



మంథని ( ప్రశ్న న్యూస్)మంథని మండలం చిల్లపల్లి గ్రామంలో మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలోని 7వ తరగతి పిల్లల ఇంగ్లీష్ రీడింగ్ స్కిల్స్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పిల్లలకు చదవడం, రాయడం వంటి ప్రాథమిక విద్యా ప్రమాణాల పెంపు పై దృష్టి సారించాలని అన్నారు. విద్యార్థులకు చదవడం తో పాటు చదివింది అర్థం చేసుకోవడం కూడా రావాలని ఆ దిశగా మన బోధన ఉండాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో గేట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారుచేసి అందించాలని , అవసరమైన నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం అదే ప్రాంగణంలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ప్రధానోపాధ్యాయులు నరసింహా రావు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ లోవైద్యుల పై దాడికి నిరసనగా ధర్నా

**ఐఎంఏ మెంబర్స్ తో కలిసి జాతీయ రహదారిపై ప్లే కార్డులతో ర్యాలీ**

**వైద్యులపై ఆసుపత్రులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి**

**శంషాబాద్ డీసీపీకి వినతి పత్రం అందజేసిన వైద్య బృందం**




రాజేంద్రనగర్(ప్రశ్న న్యూస్) శంషాబాద్ పురపాలక పరిధిలో వైద్యులపై దాడికి నిరసనగా డాక్టర్ల బృందం ఐఎంఏ మెంబర్స్ తో కలిపి పెద్ద ఎత్తున ధర్నా ర్యాలీ కార్యక్రమం నిర్వహించి డిసిపి కి వినతి పత్రం అందజేశారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ పురపాలక పరిధిలో వైద్యులపై ఆసుపత్రులపై దాడుల నిరోధించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కేంద్రంలో వైద్య బృందం చే భారీ ర్యాలీ వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలని ప్రైవేట్ ఆసుపత్రుల ఎదుట సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలంటూ జాతీయ రహదారిపై వైద్య సిబ్బంది తో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఏయిర్ పోర్ట్ చౌరస్తా వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా, శంషాబాద్ బస్టాండ్, మహావీర్ బిల్డర్స్, మధుర నగర్, ఆర్.బి నగర్, కొత్త వాళ్ళు కూడా చివరి స్థానం నుంచి డిసిపి కార్యాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి డిసిపి కార్యాలయంలో డాక్టర్ అసోసియేషన్ మెడికల్ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఆస్పత్రులపై వైద్యులపై దాడులు చేస్తున్న వారిపై చట్టారీత్యా చర్యలు తీసుకోవాలని వారు అన్నారు.

### శంషాబాద్ మైనారిటీ పాఠశాలలో

# నులిపురుగుల నివారణ దినోత్సవం

**వ్యక్తిగత శుభ్రత పాటిస్తే నులిపురుగుల నివారణ సాధ్యం అవుతుంది**

**19 ఏళ్ల లోపు వారికి తప్పనిసరిగా నట్టల నివారణ మందులు వాడాలి**

**జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు**



రాజేంద్రనగర్( ప్రశ్నన్యూస్) వ్యక్తిగత శుభ్రత పాటిస్తే నులిపురుగుల నివారణ సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరు కూడా వ్యక్తిగత శుభ్రత పరిశుభ్రత పాటించాలన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ పురపాలక పరిధిలోని రాల్లగూడ లో గల మైనారిటీ పాఠశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 11వ తేదీ సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. రెసిడెన్షియల్ విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు( ఆల్బెండజోల్ ) మాత్రలు రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ ఒకటో ఏడు నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ అంగన్వాడీ కార్యకర్తలచే సబ్ సెంటర్లలో ఏఎన్ఎం ఆశలచే నివారణ మందులు అందజేయబడుతుందని వారు అన్నారు. నులిపురుగుల నివారణ వల్ల చిన్నారుల అలసట, బలహీనత, కడుపునొప్పి, ఈ సమస్యలకు స్వస్తి పలకవచ్చన్నారు. ముఖ్యంగా పిల్లల్లో పాదరక్షలు లేకుండా ఆడడం, బహిరంగ మలవిసర్జన, మురికి చేతుల ద్వారా శరీరంలోకి వెళ్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు చేతిపరిశుభ్రం విధానము బోధించి విద్యార్థులచే ప్రదర్శించారు. వ్యక్తిగత పరిశుభ్రతచే నులిపురుగుల నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ ఎంపీడీవో మున్ని మున్ని, జిల్లా రోగ నిరోధక అధికారి డాక్టర్ షికాయత్, కళాశాల ప్రిన్సిపల్ షకీరా, డాక్టర్ విజయ పూర్ణిమ, డాక్టర్ దివ్య, జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు, డిపిఓ అక్రమ్, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి సెంటర్లో నులిపురుగుల నివారణ కార్యక్రమం

పురపాలక పరిధిలోని పలు అంగన్వాడి కేంద్రాల్లో నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని అంగన్వాడీ కేంద్రంలో టీచర్లు చిన్నారులకు మాత్రలు వేశారు. ప్రతి ఒక్కరూ నులిపురుగుల నివారణ దిశగా ముందడుగు వేయాలని చిన్నారులు ముఖ్యంగా తల్లిదండ్రులు శుభ్రత పరిశుభ్రత విషయంలో చేతులు శుభ్రంగా ఏ విధంగా చూడాలని, అన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు కూడా జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెహనా అంగన్వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

# సుష్మ మహేందర్ రెడ్డి కి డాక్టరేట్ ప్రధానం

**సిరీ స్వచ్ఛంద సంస్థతో ఎన్నో సేవా కార్యక్రమాలతో గుర్తింపు**

**పురపాలక సంఘానికి మొదటి చైర్మన్ గా విశిష్ట సేవలు**

**మానవ దృక్పథంతో ఎంతోమందికి సహాయం**

**హర్షం వ్యక్తం చేస్తున్న శంషాబాద్ పట్టణవాసులు**




రాజేంద్రనగర్(ప్రశ్న న్యూస్ )శంషాబాద్ పురపాలక మొదటి చైర్మన్ గా శంషాబాద్ పురపాలకని అండ రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకువెళ్లిన సుష్మా మహేందర్ రెడ్డి డాక్టరేట్ అందుకున్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ పురపాలక పరిధి లో మొదటిసారి చైర్మన్ ఎన్నికై శంషాబాద్ పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లిన ఘనత సుష్మ మహేందర్ కే దక్కుతుందని తెలిపారు. రాజకీయపరంగా ఎనలేని సేవలు అందించిన ఆమె తన స్థాయిని మరిచి స్వచ్ఛంద సంస్థలు సేవలందించి సిరీస్ స్వచ్ఛంద సంస్థ పేరిట నిరుపేదలకు అనేక సేవలు సేవలు అందించి అనాథలను చేరదీయడం వారికి సహాయ సహకారాలు అందించడం మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. నారీమణిగా ఉంటూ అటు రాజకీయం ఇటు సేవా కార్యక్రమాలు ఆమె ను డాక్టర్ దిశగా నడిపించాయని, ఇది ఎంతో గర్వకారణమని పట్టణ ప్రజలు ఆమె సేవలను కొనియాడుతున్నారు. పురపాలక పరిధిలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన ఘనత కూడా సుష్మ మహేందర్ రెడ్డికే దక్కుతుందన్నారు.

**అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది**

**సేవ చేయడం నా అదృష్టంగా భావిస్తాను**

**పురపాలక మాజీ చైర్మన్ సుష్మ మహేందర్ రెడ్డి**

చేసిన సేవలు గాను డాక్టరేట్ రావడం చాలా సంతోషంగా ఉంది అన్నారు. ముఖ్యంగా శంషాబాద్ పట్టణ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతున్నాను అన్నారు. అదేవిధంగా శంషాబాద్ కురపాలికగా రావడం చైర్మన్ గా నాకు అవకాశం రావడం పట్టణ ప్రజలు నాకు ఇచ్చిన అవకాశం గా భావిస్తున్నానని, చైర్మన్గా అటు అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలు అభివృద్ధి కార్యక్రమాలకు నాకు అండగా నిలిచి అనేక విధాలుగా సహకరించారని తెలిపారు. పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు సిరి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు ప్రతి ఏటా బుక్స్ షూస్ అందజేయడం జరిగిందని నాకు ఈ అవకాశం భగవంతుడు కల్పించిన అదృష్టంగా భావిస్తానని ఆమె అన్నారు. శంషాబాద్ పట్టణ ప్రజలకు మరొకసారి కృతజ్ఞతలు తెలుపుతున్నానని, నాకు ఈ డాక్టరేట్ రావడం దానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

### దశాబ్దాల స్వప్నం సాకారం కాబోతుంది.

# అంతా"ఆనంద"మయం

**ఇరవై నాలుగు ఏళ్ల ఆలోచనకు నీళ్ళు పోసింది కమిటీ**







కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో దశాబ్దాల పాటు ఎదురు చూస్తున్న కళ కళ్ల ముందే సాకారం కాబోతుంది.ఇరవై నాలుగేళ్లుగా మంచి నీటి సమస్యతో బాధపడుతున్న బోయిన్ పల్లి మార్కెట్ కమీషన్ దార్లకు కమిటీ ఇచ్చిన మాట నిలబెట్టుకుంది.గత రెండు దశాబ్దాలుగా కోట్ల రూపాయలు తాగు నీరు కోసం వెంచించి విసిగిపోయిన ఏజేంట్లకు మేం ఉన్నామని అభయం ఇచ్చిన కమిటీ. కాంగ్రెస్ పార్టీ గౌరవాధ్యక్షులు వేం నరేందర్ రెడ్డి,మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, హైదరాబాద్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి పోన్నం ప్రభాకర్,స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ తో పాటు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ సురేందర్ మోహన్, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మి బాయ్,బోయిన్ పల్లి మార్కెట్ ఉన్నత శ్రేణి గ్రేడ్ వన్ అధికారి ఎం వేంకన్న తదితరుల సహాయ సహకారాలతో విజయం సాధించామని కమిటీ పెద్దలు ఆనందోత్సాహంలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.రేపురాబోయే వారం రోజుల్లో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ ప్రాంగణం వద్ద ఉన్న రహదారి నుంచి మార్కెట్ లోపల వరకు సుమారు "కిలో మిటర్" వరకు లైన్ క్లియర్ అవుతుంది.ప్రతి షాపుకు నీటి సరఫరా అవుతుంది.సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధికారుల అంచనా ప్రకారం సుమారు "55"లక్షల రూపాయలు ఖర్చు అవుతున్నట్లు గతంలోనే వెల్లడించిన విషయం విదితమే!అలాగే గతంలో బోర్డు సమావేశంలో కూడా బోయిన్ పల్లి మార్కెట్ నుంచి ప్రతిపాదనలు వచ్చాయని బోర్డు సిఇవో మధుకర్ నాయక్తెలిపారు.కానీ మంజూరు అయ్యే నిధులు బోయిన్ పల్లి మార్కెట్ ప్రధాన ముఖ ద్వారం నుంచి లోపలికి వరకే ఆరు ఇన్చుల మందం గల పైప్ లైన్ ద్వారా నీటి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటారు.అలాగే మార్కెట్లో నాలుగు లైన్ల పొడువునా ప్రతి దుకాణానికి మంచి నీటి సౌకర్యం కల్పిస్తారని బోర్డు అధికారులు వెల్లడించారు.మార్కెట్లో సుమారు రెండు వందల పై చిలుకు కమీషన్ ఏజెంట్ల షాపులకు మంచి నీటి సౌకర్యం కల్పించడం వల్ల బోర్డుకు ఆదాయం కూడా సమకూర్చుతుంది.ఏదేమైనా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ బోయిన్ పల్లికి వచ్చిన తర్వాత నుంచి మొట్టమొదటి సారి ఇంత పెద్ద స్థాయిలో మార్కెటింగ్ శాఖ అధికారులు నిధులు విడుదల చేయడం ఇదే తొలిసారి అని మార్కెట్ వర్గాలు అభిప్రాయం.

**కమిటీ మాట నిలబెట్టుకుంది:** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు ఆన్ లైన్ లో వివరణ: గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వంలో తన సతీమణి రాగిరి హారిక ఆనంద్ బాబు బోయిన్ పల్లి మార్కెట్ చైర్మన్ గా ఉన్నప్పుడు స్థానికంగా నెలకొన్న మౌళిక సదుపాయాల కల్పనలో పాటు మంచి నీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలని అప్పట్లో అనుకున్నాను కానీ ఎవ్వరూ సహకరించిక పోవడం వల్ల ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లుగా ఉంది వ్యవహారం.నా కళ కళగానే మిగిలిపోవద్దన్నీ,నా దైవం, రాజకీయ గురువు మల్కాజిగిరి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతు రావు సహకారంతో బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటి సారి మంచి నీటి సరఫరా విషయంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సిఇవో మధుకర్ నాయక్ తో భేటీ అయ్యి చర్చించినట్లు చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు వెల్లడించారు.అనంతరం సెక్రటరీ సహాయ సహకారంతో సంబంధిత అధికారులతో పాటు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి వినతిపత్రం అందజేసినిత్యం అదే పనిగా అందర్నీ కలుస్తూ చివరికి విజయం సాధించామని కన్నీటిపర్యంతమయ్యారు చైర్మన్.ఇది అందరి విజయమని ఆయన అన్నారు.అలాగే బోయిన్ పల్లి మార్కెట్లో మంచి నీటి సరఫరా కు పది రోజుల్లో లైన్ క్లియర్ అవుతుందన్నారు.చంద్రారెడ్డి అసోసియేషన్ జనరల్ సెక్రటరీ: బోయిన్ పల్లి మార్కెట్ లో గత ఇరవై నాలుగు సంవత్సరాలుగా ఎదుర్కోంటున్న మంచి నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులను, నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిటీ దృష్టికి తీసుకెళ్లిన ప్రతి సారి "చూస్తాం చేస్తాం"అంటూ కాలం సాగిపోయేది,కానీ కమిటీలు మారుతున్నాయి,మా తలరాతలు మారడం లేదు!కళ్లల్లో క"నీళు ళ్"తప్పా, కొప్పుడు నీళ్ళు లేకపాయే అని నిరంతరం బాధతో రగిలిపోయే వాళ్లం.కానీ బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ బాధ్యతలు చేపట్టిన (27/1/25) పెద్దలు.అన్నమాట నిలబెట్టుకున్నారు.అలాగే అసోసియేషన్ జనరల్ సెక్రటరీ చంద్రారెడ్డి ఫోన్లో మాట్లాడుతూ సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ తరపున మార్కెట్ కమిటీకి మా ప్రత్యేక ధన్యవాదాలని తెలియజేశారు.

# ఏపీ ప్రభుత్వ వాహనంలో ప్రయాణం

## వివాదంపై స్పందించిన నిధి అగర్వాల్



ఇటీవల హరిహర వీరమల్లు సినిమాతో ప్రేక్షకులని పలకరించిన నిధి అగర్వాల్ తాజాగా ఓ వివాదంలో చిక్కుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహనాన్ని వినియోగించడంపై సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేగుతోంది. ఒక పనిమీద విజయవాడకి వెళ్లిన నిధి ఏపీ ప్రభుత్వ వాహనంలో ప్రయాణించినట్లుగా పలు ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో నెటిజన్స్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిధులతో నిర్వహించే వాహనాలను వ్యక్తిగత, వాణిజ్య కార్యక్రమాలకు ఎలా ఉపయోగిస్తారంటూ మండిపడ్డారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులకు మాత్రమే కేటాయించిన వాహనాలను ఒక ప్రైవేట్ కార్యక్రమానికి వినియోగించడమేంటని కొందరు నాయకులు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమవరంలో జరిగిన ఓ స్టోర్ లాంచ్ ఈవెంట్‌కి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహనంలో నిధి హాజరు కావడం ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో నిధి అగర్వాల్ తన అధికారిక ఎక్స్ (%ఒషఉవతీ%) ఖాతాలో స్పందిస్తూ, ఈ వివాదంపై స్పష్టత ఇచ్చారు. "భీమవరంలో జరిగిన ఈవెంట్‌లో పాల్గొనడానికి నిర్వాహకులు నాకు రవాణా సదుపాయం ఏర్పాటు చేశారు. వారు పంపిన వాహనం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందినదై ఉండొచ్చు. కానీ, వాహనం ఎంపికలో నా పాత్ర ఏమీ లేదు. ఇది కేవలం లాజిస్టికల్ అవసరాల కోసమే నిర్వాహకులు అందించిన సదుపాయం" అని నిధి తెలిపారు. అంతేకాకుండా, కొన్ని ఆన్‌లైన్ వేదికల్లో "ప్రభుత్వ అధికారులు నిధి కోసం ప్రత్యేక వాహనం పంపించారు" అనే తప్పుడు ప్రచారం జరుగుతుండటాన్ని ఆమె ఖండించారు. "ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి. ప్రభుత్వ అధికారులెవ్వరూ నాకోసం ప్రత్యేకంగా వాహనం పంపలేదు. ఈ వ్యవహారంలో నాకు ఎలాంటి సంబంధం లేదు. తప్పుడు సమాచారం ప్రచారం కాకుండా ఉండేందుకు నిజాలను బయటపెట్టడం నా బాధ్యత" అని పేర్కొన్నారు. చివరగా, ఆమె తన అభిమానులకు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, "మీ ప్రేమ, మద్దతు పట్ల ఎప్పుడూ కృతజ్ఞతలు. మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను" అని నిధి అగర్వాల్ పేర్కొన్నారు.

# రీఎంట్రీ మూవీ ఇదేనా?



కొన్నేళ్ల పాటు తెలుగులో తిరుగులేని హవా సాగించింది బాలీవుడ్ భామ పూజా హెగ్డే. తెలుగులో తన తొలి మూడు చిత్రాలు ముకుంద, ఒక లైలా కోసం, దువ్వాడ జగన్నాథం ఆశించిన ఫలితాలు అందించకపోయినా.. ఆమె కెరీర్‌కు ఢోకా లేకపోయింది. 'దువ్వాడ జగన్నాథం' సినిమాలో సూపర్ సెక్సీగా కనిపించి కుర్రాళ్ల గుండెలకు గాయాలు చేసిన పూజాకు అవకాశాలు వరుస కట్టాయి. మహేష్ బాబు, ఎన్టీఆర్, ప్రభాస్ లాంటి టాప్ స్టార్లతో సినిమాలు చేసిందామె. కానీ ఒక దశలో వరుస ఫ్లాపులు రావడంతో పూజా కెరీర్ డౌన్ అయిపోయింది. కొన్నేళ్ల నుంచి తెలుగులో సినిమానే చేయలేదు పూజా. ఆ సమయంలో హిందీ, తమిళంలో మాత్రం బాగానే అవకాశాలు దక్కించుకుంది. తెలుగు రీఎంట్రీ గురించి వార్తలు వస్తున్నాయి కానీ.. అవేవీ నిజం కాలేదు. ఐతే ఈ మధ్య 'రెట్రో' ప్రమోషన్ల కోసం హైదరాబాద్ వచ్చిన పూజా.. తన రీఎంట్రీ తెలుగు మూవీ దాదాపు ఓకే అయినట్లు చెప్పింది. ఆ కబురు కోసమే తన ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు పూజా చేయబోయే తర్వాత తెలుగు సినిమా గురించి సమాచారం బయటికి వచ్చింది. ఆమె నితిన్ సరసన నటించబోతున్నట్లు తెలుస్తోంది. వరుస ఫ్లాపులతో సతమతం అవుతున్న నితిన్.. త్వరలోనే విక్రమ్ కుమార్ దర్శకత్వంలో సినిమాను మొదలుపెట్టబోతున్నాడు. వీరి కలయికలో వచ్చిన 'ఇష్క్' ఎంత పెద్ద హిట్టయిందో తెలిసిందే. మళ్లీ సుదీర్ఘ విరామం తర్వాత వీళ్లిద్దరూ కలిసి సినిమా చేయబోతున్నారు.

# మహేష్ అసలైన మలుపు



నిన్న 50వ పడిలో అడుగుపెట్టిన సూపర్ స్టార్ మహేష్ బాబుకి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. సెలబ్రిటీలతో మొదలుపెట్టి అతడు రీ రిలీజ్ థియేటర్లలో అభిమానుల దాకా అందరూ ఘనంగా జరుపుకున్నారు. అయితే అర్ధ శతాబ్దం పూర్తి చేసుకున్న సూపర్ స్టార్ కి ఇది ఎందుకు అసలైన మలుపు కానుందో చూద్దాం. పాతికేళ్ల నట ప్రస్థానంలో మహేష్ సోలో హీరోగా చేసినవి 28 సినిమాలే. వాటిలో ఒక్క రీమేక్ లేదు. పక్క భాషల నుంచి కథలు అద్దెకు తెచ్చుకుని సేఫ్ గేమ్ ఆడలేదు. హిందీ మార్కెట్ కోసం పాకులాడలేదు. ఆ మాటకొస్తే తనను కలిసిన ఎందరో బాలీవుడ్ మేకర్స్ కి సున్నితంగా నో చెప్పుకుంటూ వచ్చి ఓన్లీ తెలుగుతో గెలుస్తూ వచ్చాడు. ఇప్పుడు కోరుకున్న ఘడియ రానే వచ్చింది. ప్రపంచంలోని టాప్ క్లాస్ ఫిలిం మేకర్స్ సైతం ఎదురు చూస్తున్న ఎస్ఎస్ఎంబి 29 చేతికి దక్కింది. రాజమౌళి తన మరో కలల ప్రాజెక్టుకు మహేష్ బాబునే ఎంచుకున్నాడు. ఆర్ఆర్ఆర్ తో కేవలం పాటకు మాత్రమే ఆస్కార్ తెచ్చుకున్న జక్కన్న ఈసారి దర్శకత్వ అవార్డు వైపు గురి పెడుతున్నాడు. కేవలం ప్రీ లుక్ తోనే ప్రకంపనలు రేపుతున్నాడు. భారతీయ మూలాలు మర్చిపోకుండా తీసుకున్నది ఇండియానా జోన్స్ స్ఫూర్తినే అయినా మన నేటివిటీతో మన అడవి కథను గర్వంగా చూపించబోతున్నాడు. ఇప్పటిదాకా నార్త్ ని సీరియస్ గా తీసుకోని మహేష్ కు ఇప్పుడు ఏకంగా గ్లోబల్ గుర్తింపు రానుంది. నవంబర్ లో టీజర్ వస్తుందని రాజమౌళి సూచన ఇచ్చారు కాబట్టి ఫస్ట్ దర్శనం కోసం ఇంకో మూడు నెలలు ఎదురు చూడాల్సిందే. బాలనటుడిగా బుడిబుడి అడుగులు వేస్తూ, నాన్న కృష్ణతో కలిసి తెరను పంచుకుంటూ, అన్నయ్య రమేష్ విఫలమైన చోట తాను గెలవాల్సిన కర్తవ్యాన్ని గుర్తు చేసుకుంటూ ఇన్ని మైలురాళ్ళు దాటి గెలవడం ఫ్యాన్స్ నిత్యం గుర్తు చేసుకుంటూ ఉంటారు. అభాగ్యులైన చిన్న పిల్లల ప్రాణాలు కాపాడుతూ, వివాదాలకు దూరంగా ఉంటూ మహేష్ సాగిస్తున్న ప్రస్థానం వంద సినిమాలను చేరుకుంటుందో లేదో కానీ వందేళ్ల పాటు గుర్తుండిపోయే ల్యాండ్ మార్క్ మూవీస్ అందించే హామీ ఇస్తోంది.

# 'పరదా'లో అనుపమ


## 2.0ని చూస్తారు..



పురుషాధిపత్యంపై విసిగిపోయిన ఓ అమ్మాయి ధైర్యంగా తీసుకున్న నిర్ణయమే ప్రధానాంశంగా రూపొందిన చిత్రం 'పరదా'. అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో దర్శన రాజేంద్రన్, సంగీత, రాగ్ మయూర్ కీలక పాత్రలు పోషించారు. ప్రవీణ్ కండ్రేగుల దర్శకుడు. శ్రీనివాసులు పి.వి, శ్రీధర్ మక్కువ, విజయ్ డొంకడ నిర్మాతలు. ఈ నెల 22న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు.

# 'మరొక్కసారి'..

## ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ



నరేష్ అగస్త్య, సంజనా సారథి ప్రధాన పాత్రల్లో నటించిన ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ 'మరొక్కసారి'. సి.కె.ఫిల్మ్ మేకర్స్ బ్యానర్‌పై బి.చంద్రకాంత్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం నితిన్ లింగుట్ల. ఇప్పటికే చిత్రీకరణను పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులను శరవేగంగా జరుపుకుంటోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ మూవీకి భరత్ మాంచి రాజు సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రంలో మొత్తం ఆరు పాటలుం టాయి. ఈ పాటలను టాలీవుడ్ టాప్ సింగర్లు కార్తిక్, ప్రదీప్ కుమార్, దేవన్ ఏకాంబరం, జాస్సీ గిఫ్ట్ వంటి వారు పాటల్ని పాడారు. ఇప్పటికే పాటలకు సంబం ధించిన చిత్రీకరణ కూడా పూర్తయింది. అందమైన ప్రేమ కథా చిత్రానికి విజువల్స్ మరింత అందాన్ని తీసుకు రాబోతోన్నాయి. ఈ చిత్రాన్ని కేరళ, సిక్కిం, టిబెట్ సరిహద్దు ప్రాంతాల్లో చిత్రీకరించారు. ఇంత వరకు ఏ ఇండియన్ సినిమా కూడా షూటింగ్ చేయనటువంటి గురుడోంగ్మార్ లేక్ వంటి ప్రదేశంలో ఈ ఈ సినిమా చిత్రీకరణ జరుపుకోవడం విశేషం. 5,430 మీ. ఎత్తులో ఉండే గురుడోంగ్మార్ లేక్‌లో షూటింగ్ చేసిన మొట్టమొదటి ఇండియన్ మూవీగా ఈ చిత్రం నిలిచింది. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాకు సంబంధించిన అప్డేట్ వచ్చింది. తాజాగా రిలీజ్ చేసిన టైటిల్ పోస్టర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ పోస్టర్‌ను చూస్తుంటే ఓ ఆహ్లాదకరమైన ప్రేమ కథను చూడబోతోన్నామని అర్థం అవుతోంది. త్వరలోనే చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు అని చిత్రయూనిట్ తెలిపింది. బ్రహ్మాజీ, సుదర్శన్, వెంకట్, వెంకట్ కాకమాను, దివ్యవాణి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరామెన్: రోహిత్ బచు, ఎడిటర్: చోటా కే ప్రసాద్.

# ఫ్యాన్ వార్స్‌కు చెక్ పెట్టిన ఎన్టీఆర్



తమ హీరో గొప్ప అంటే తమ హీరో గొప్ప అనుకోవడం ఒక లెక్క. అవతలి హీరోలను కించపరచడమే పనిగా పెట్టుకోవడం ఇంకో లెక్క. సోషల్ మీడియా పుణ్యమా అని వీరాభిమానుల్లో చాలామంది రెండో పనికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంటారు. ఇద్దరు హీరోలు కలిసి ఓ సినిమా చేస్తే.. అవతలి హీరోను డీగ్రేడ్ చేయడమే ధ్యేయంగా పని చేస్తుంటారు. జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ కలిసి చేసిన 'ఆర్ఆర్ఆర్' సినిమాలో ఎవరు హైలైట్ అయ్యారు.. ఎవరు మెయిన్ హీరో అనే విషయంలో ఏళ్ల తరబడి కొట్టుకుంటూనే ఉన్నారు. అది చాలదని తారక్.. బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న 'వార్-2' సినిమా విషయంలో కూడా ఇదే రచ్చ కొనసాగుతూ ఉంది. ఇక్కడ తారక్, హృతిక్ ఫ్యాన్స్ గొడవ పడినా ఒక అర్థం ఉందనుకోవచ్చు. కానీ తారక్ యాంటీ ఫ్యాన్స్ హృతిక్‌ను లేపుతూ, తారక్‌ను కించపరిచే ప్రయత్నం చేస్తుండడం గమనార్హం. వారితో తారక్ ఫ్యాన్స్‌కు గొడవ పడుతున్నారు. ఐతే ఈ అనవసర ఫ్యాన్ వార్స్ తారక్ దృష్టికి కూడా వచ్చాయేమో.. 'వార్-2' ప్రి రిలీజ్ ఈవెంట్లో ఈ అంశం మీద మాట్లాడాడు. 'వార్-2' నుంచి ఇటీవల రిలీజ్ చేసిన డ్యాన్స్ నంబర్లో ఎవరు హైలైట్ అయ్యారు అనే విషయంలో వాదనలు నడుస్తుండగా.. తారక్ వాటికి చెక్ పెట్టే ప్రయత్నం చేశాడు. ఈ పాటలో ఎవరు బాగా డ్యాన్స్ చేశారు అనే చర్చ అనవసరమని.. సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ చర్చ అభిమానులను తప్పుదోవ పట్టించేదని తారక్ అన్నాడు. ఈ పాట ఇద్దరు బెస్ట్ డ్యాన్సర్స్ కలిసి చేసిన సాంగ్ అని.. దాన్ని ఎంజాయ్ చేయాలని.. వాదనలు అనవసరమని తారక్ స్పష్టం చేశాడు.

# ఎమోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్



గగన్ బాబు, కశికా కపూర్ హీరో, హీరోయిన్స్‌గా సత్యం రాజేష్, సాయి రోనఖ్ కీలక పాత్రలలో ఓ సినిమా రూపొందనుంది. ఎమోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కబోయే ఈ చిత్రాన్ని ఎకె. జంపన్న దర్శకత్వంలో గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం1గా తోట లక్ష్మీ కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు. ఈ కొత్త చిత్రం ఆదివారం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత సాహు గారపాటి క్లాప్ కొట్టగా, వివేక్ కూచిభట్ల కెమెరా స్విచాన్ చేశారు. దర్శకుడు ఎకె జంపన్నకి నిర్మాత తోట లక్ష్మీ కోటేశ్వరరావు స్క్రిప్ట్ ఆందచేశారు. ఫస్ట్‌షాట్‌కు వీర శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. డైరెక్టర్ జంపన్న మాట్లాడుతూ,'నిర్మాత కోటేశ్వరరావుతో ఈ కథ చెప్పినప్పుడు ఈ సినిమా ఖచ్చితంగా తానే చేయాలని గోల్డెన్ ప్రొడక్షన్ బ్యానర్ పెట్టి నిర్మిస్తున్నారు. ఇదొక ఎమోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్. చాలా లేయర్స్ ఉంటాయి. అందరూ మాట్లాడుకునే విధంగా ఉంటుంది. త్వరలోనే షూటింగ్ మొదలు పెడతాం' అని అన్నారు. 'మా గోల్డెన్ ప్రొడక్షన్స్‌లో వస్తున్న ఫస్ట్ ఫిల్మ్ ఇది. అనూప్ రూబెన్స్ మ్యూజిక్ అందిస్తున్నారు. అలాగే ప్రముఖ నటీనటులందరూ కథ నచ్చి ఇందులో నటించేందుకు అంగీకరించారు. అద్భుతమైన స్టోరీ ఇది. దేశం అంతా మాట్లాడుకునే విధంగా ఉంటుంది' అని నిర్మాత తోట లక్ష్మీ కోటేశ్వరరావు చెప్పారు. హీరో గగన్ మాట్లాడుతూ,'డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు నాకు చాలా నచ్చింది. అద్భుతమైన ఎమోషన్స్, వేరియేషన్స్ ఉన్న క్యారెక్టర్ చేస్తున్నాను. ఈ సినిమా కంప్లీట్‌గా మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేస్తుంది. క్లైమాక్స్ అత్యద్భుతంగా ఉంటుంది. ఇది ప్యూర్ ఎమోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్' అని తెలిపారు. 'ఇందులో నటించే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు. ఈ సినిమా నాకు చాలా స్పెషల్. ఇలాంటి మాస్టర్ పీస్‌లో భాగంగా చాలా ఆనందంగా ఉంది' అని హీరోయిన్ కశికా కపూర్ చెప్పారు.

# గంజాయి విక్రయాలు, రౌడీయిజం అరికట్టడంలో పోలీసులు విఫలం

**- పోలీసులపై ఉన్నతాధికారులు ఫిర్యాదు చేస్తా**

**- ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే సునీల్ కుమార్**



గూడూరు (ప్రశ్న న్యూస్) గూడూరు పట్టణంలో పోలీసులు నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారని పట్టణంలో గంజాయి విక్రయాలు, రౌడీయిజం రెచ్చిపోతున్నా అరికట్టడంలో పోలీసులు విఫలమవుతున్నారని వారి చర్యలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ హెచ్చరించారు. గూడూరు పట్టణంలోని రెండో వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత రెండు రోజులుగా గూడూరు పట్టణంలో ఓ ప్రైవేట్ మెడికల్ షాప్ లో గంజాయి విక్రయాలు జరిగాయని మీడియాలో, పత్రికల్లో వచ్చిన విషయంపై వ్యవహరించిన పోలీసుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గంజాయి విక్రయాలు జరిగిన విషయంపై ప్రెస్ మీట్ పెట్టకుండా వివరాలు చెప్పకపోవడంపై డిఎస్పి, సీఐ ల తీరుపై డిఐజి కి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్) ధర్మపురి పట్టణ కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,జిల్లా వైద్య అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు వైద్య అధికారులతో కలిసి నులిపురుగుల నివారణ మాత్రలను అందజేసారు.పిల్లలు నిత్యం చేతులు శుభ్రంగా కడుక్కోవాలని,తిన్నాప్పుడే కాదు,ఆడిన తర్వాత, టాయిలెట్ వెళ్లిన తర్వాత కూడా శుభ్రత పాటించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల అనేక వ్యాధులను దూరం చేసుకోవచ్చని,ముఖ్యంగా నులిపురుగుల వల్ల వ్యాపించే వ్యాధుల నివారణలో పరిశుభ్రత కీలకం అని అన్నారు.అదే విధంగా ప్రతి ఇంట్లోనూ, పాఠశాలల్లోనూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని,ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకుని సకాలంలో టీకాలు వేయించుకోవాలని ఆరోగ్యంతో పాటు విద్యార్థుల మానసికాభివృద్ధికీ పరిశుభ్రత అవసరమని ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యలో మెరుగైన ఫలితాలు సాధించగలరు అని ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య వైద్య శాఖ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఈ నెల 17న సాకేత్ ప్రణామం సొసైటీ డైరెక్టర్స్ ఎన్నిక



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలోని గౌడవల్లి సాకేత్ ప్రణామం ఫ్లాట్ ఓనర్స్ సొసైటీ డైరెక్టర్ల ఎన్నికలు ఈ నెల 17న జరుగుతాయని ఎన్నికల అధికారి మహ్మద్ తారిఖ్ హుస్సేన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజీనామా చేసిన ముగ్గురు డైరెక్టర్ల స్థానాలు భర్తీ చేయడానికి ఈ ఎన్నికలు అవసరమయ్యాయని చెప్పారు. నామినేషన్ దరఖాస్తులు 11,12 తేదీలలో స్వీకరించారు. ఉపసంహరణ 13న ఉంటుందని, పోలింగ్ 17న జరిగిన అనంతరం ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. ఫలితాలు ప్రకటించిన వెంటనే అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నిక నిర్వహించి ఎన్నిక ప్రక్రియ పూర్తి చేస్తామని వివరించారు.

**నాలుగు నామినేషన్లు దాఖలు :**సాకేత్ ప్రణామం సొసైటీ డైరెక్టర్స్ ఎన్నిక కోసం మొదటి రోజు నలుగురు సభ్యులు నామినేషన్లు వేశారని ఎన్నికల అధికారి మహ్మద్ హుస్సేన్ తెలిపారు. మూడు డైరెక్టర్ పదవులు ఖాళీ ఉన్నాయని మంగళవారం సైతం నామినేషన్లు స్వీకరిస్తామని ఆయన చెప్పారు. ఈ నెల 17న జరిగే ఎన్నికల్లో పోటీ చేయాలనే అభ్యర్థులు వెయ్యి రూపాయలు చెల్లించి తమ నామినేషన్ పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని ఎన్నికల అధికారి తెలిపారు.

# మేడ్చల్ లో భారీ త్రివర్ణ పతకంతో ర్యాలీ



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా భారీ జెండతో ర్యాలీ నిర్వహించారు. మేడ్చల్ పట్టణంలోని పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమలో ముఖ్య అతిథిగా మాజీ జిల్లా అధ్యక్షులు విక్రం రెడ్డి పాల్గొని మాట్లాడుతూ దేశ ప్రజలు అందరూ ఐక్యంగా ఉన్నపుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. పహాల్గమ్ దాడి తరువాత ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రత్యర్థి స్థావరాలను ముట్టిబెట్టిన తరువాత దేశ ప్రజల ఐక్యత కోసం పోరాటం చేసిన వీర జవాన్లకు నివాళులు అర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ పురపాలక మహిళా అధ్యక్షురాలు జెల్లీ శైలజహరినాథ్, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, యువ మోర్చా రాష్ట్ర నాయకులు రాగం అర్జున్, పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శులు జాకట ప్రేమ్ దాస్, వంశీ విజయ్, కార్యదర్శులు బండి విష్ణుమూర్తి, బొక్క సురేందర్ రెడ్డి, పురపాలక సంఘం ఉపాధ్యక్షులు మైసరి రాజు, లవంగ శ్రీకాంత్ మాజీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ నాయకులు చిర్ల సత్యనారాయణ, సర్వేశ్వర్ రెడ్డి, వంశీధర్ రెడ్డి, మల్లారెడ్డి,డి.సాయి కుమార్, వెంకటేష్, నర్సింగ్ రావు, మహిళా నాయకులు అనిత, శోభ రెడ్డి, నాయకులు అనిల్ రెడ్డి, ఈశ్వర్ కూర్మ, మహేష్ గౌలికర్, జాకట బాబు రాజు ( జేబీఆర్),కేశవా రెడ్డి, ప్రణయ్, మహేందర్, నరేందర్, వెంకటేశ్వర్లు, యువజన సంగం నాయకులు, స్కూల్ విద్యార్థులు, పురపాలక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# హాస్పిటల్ కు రాలేకపోతున్న పేదవారి వద్దకే నారాయణ హాస్పిటల్ ఆన్ వీల్స్.

**చికిత్స కంటే నివారణ మేలు. వ్యాధులను ముందుగా నిర్ధారించుకుంటే నివారించవచ్చు.**

**నారాయణ హాస్పిటల్ ఆన్ వీల్స్ లో పూర్తి హాస్పిటల్ సెటప్ ఉంది.**

**మంత్రి నారాయణ కు వచ్చిన ఆలోచనతో సమాజంలో మార్పు వస్తుంది.**

**- షేక్ అబ్దుల్ అజీజ్, ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్,**





నెల్లూరు(ప్రశ్న న్యూస్) నెల్లూరు నగరంలోని 43వ డివిజన్లో గల షాదీ-మంజిల్ వద్ద పేద ప్రజల కోసం ఏర్పాటుచేసిన నారాయణ హాస్పిటల్ ఆన్ వీల్స్ ను పురపాలక శాఖ మంత్రివర్యులు పొంగూరు నారాయణ, ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్, నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, పేదవారు ఆరోగ్యం కోసం పని వదిలి ఆస్పత్రికి వెళ్ళడానికి కూడా ఆలోచిస్తున్నారని, ఆసుపత్రి కి రాలేని పేద ప్రజల వద్దకే ఆసుపత్రి వెళ్లాలన్న ఆలోచనతో మంత్రి నారాయణ హాస్పిటల్ ఆన్ వీల్స్ ని తీసుకొచ్చారని అన్నారు. చికిత్స కంటే నివారణ మేలని కొన్ని వ్యాధులు ముందుగా నిర్ధారించుకుంటే నివారించవచ్చని, నిర్ధారించుకోకపోతే ప్రాణాలకు ముప్పు వచ్చే అవకాశం ఉందని అన్నారు. నారాయణ తీసుకొచ్చిన వాహనాల్లో పూర్తి హాస్పిటల్స్ సెటప్ ఉందని, ఈసీజీ, అల్ట్రా సౌండ్, ఎక్రే, ల్యాబ్, ఫార్మసీ అన్నీ ఉన్నాయని తెలిపారు. మహిళల్లో తరచుగా ఎదురయ్యే ఆంకాలజీ సమస్య కి సంబంధించిన అన్ని టెస్టులు చేస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నారాయణ ఆసుపత్రిలో మాతృ సేవా పథకం కింద గర్భిణీ స్త్రీలకు ఉచితంగా సేవలు అందజేస్తున్నారని, ఇప్పుడు పేదవారికోసం హాస్పిటల్ ఆన్ వీల్స్ తీసుకొని వచ్చారని ఇలాంటి ఆలోచనలతో సమాజంలో మార్పు వస్తుందని అన్నారు. నారాయణ మంత్రిగా ఉండడం రాష్ట్ర జిల్లా ప్రజలు చేసుకున్న అదృష్టమని నారాయణ సంస్థకు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు రూప్ కుమార్ యాదవ్, తహసీన్, జాఫర్ షరీఫ్, మైనుద్దీన్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# జుంపాల వాకిట్లో "జూ లక టక" రోడ్డు నీది, వీధి నాది

**ఏడేళ్ల నుంచి ఏధేచ్ఛగా వ్యాపారాలు,లక్షల కమాయ్**

**ఎవరిది జానెడు జాగ కోసం లక్షల కిరాయి**

**కంటికి కనపడదా అధికారులకు.?**

**ఏరియా చిన్నది,లేక్కలెనంత వ్యాపారం ఎవరిది.?**

**సహకరిస్తున్న ఏజెంటు పై చర్యలు ఏమీ,"తక్ పట్టి"ఎంట్రీతో ఎంచక్కా దందా**

**గతంలో షాపులో మద్యం సేవిస్తూ అడ్డంగా బుక్కయ్యాడు**

**"మార్కెట్ గీత సమాధి"**

**దొండకాయలతోదంచుతున్న వ్యాపారంఅంతా**

**ఆ "శ్రీనివాసుని లీలలు" కొంటె మాటలతో, కుంటి పనులు.?**






కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగరంలో ప్రధాన రహదారులు పై చిరు వ్యాపారులు వ్యాపారం చేస్తుంటారు.ఇది సర్వసాధారణం అయిపోయింది.కానీ ప్రస్తుతం సిటీలో ట్రాఫిక్ జామ్ తో వాహనదారులు చుక్కలు చూస్తున్నారు.నగర ట్రాఫిక్ అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలు తొలగిస్తున్నారు.కొంత మేరకు ప్రజలకు ఊరట లభిస్తుంది. ఇలాంటి సంఘటనలు నిత్యం రద్దీగా ఉన్న ప్రదేశాల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి.అయితే ప్రధాన రహదారులు, అంతర్గత దారులపై ఉన్న భవన యజమానులు చిరు వ్యాపారులు చిన్న షాపు ఏర్పాటు చేసుకుంటే వారి వద్ద నుంచి రోజు వారి కిరాయి,లేక నెలకి కిరాయి వసూళ్లు చేస్తుంటారు.ఈ నేపథ్యంలో డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో అన్ని వింతలే!మార్కెటింగ్ శాఖ అధికారులు బోయిన్ పల్లి మార్కెట్ కమీషన్ ఏజెంట్లకు లైసెన్స్ లు జారీ చేసిన విషయం తెలిసిందే, కానీ ఏజెంట్లు మాత్రం మార్కెట్లో వారికి కేటాయించిన షాపు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఇతరులకు కిరాయిలు,మరో ప్రబుద్ధుడు అయితే ఏకంగా దుకాణాన్ని ఆనుకొని ఉన్న ఖాళీ స్థలాన్ని విక్రయించి లక్షల రూపాయలు వెనుకేసుకున్నాడు.రోడ్డును అమ్మీ సుమారు నాలుగున్నర సంవత్సరాల క్రితమే జరిగినట్లు మార్కెట్ వర్గాలు గుసగుసలు వినిపిస్తున్నాయి.సదరు వ్యాపారి ఏధేచ్ఛగా వ్యాపార లావాదేవీలు నిర్వహించడం గమనార్హం. ఈ దారి కొనుగోలు వెనుక పెద్ద తలలే ఉన్నాయని విశ్వసనీయ సమాచారం.బట్టబయలు చేసిన



అధికారులు: బోయిన్ పల్లి మార్కెట్ లో నిత్యం ట్రాఫిక్ జామ్ తో బెంబేలెత్తిపోతున్నారు అధికారులు.ప్రతి నెల కొకసారి వచ్చే అమావాస్య ముందు రోజు మార్కెట్లో డబల్ మార్కెట్ అవ్వడం అనవాయితీ, ప్రతి రోజూ బోయిన్ పల్లి మార్కెట్ కి సుమారు ఇరవై ఐదు వేల టన్నుల కూరగాయలు వివిధ రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయి.అడుగేస్తే జాగ కన్పియని చోటు,ఈ సమస్య మార్కెట్ అంతర్గతంలోనే కాదు,మార్కెట్ బయట కూడా ఇదే పరిస్థితి ఆఫ్ కిలో మీటర్ల వరకు వాహనాలు భారీ సంఖ్యలో ట్రాఫిక్ జామ్ తో దర్శనమిస్తాయి.అయితే బోయిన్ పల్లి మార్కెట్ సెక్రటరీ ఎం వేంకన్నకు తలనొప్పిగా మారినా ట్రాఫిక్ జామ్.ఈ సమస్య నుంచి బయటపడాలంటే ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఓగోప్ప ఆలోచనతో ముందుకు వచ్చారు.మార్కెట్ గ్రౌండ్లో "గీతలు గీసి"ఆ పరిధిలోనే వ్యాపార లావాదేవీలు నిర్వహించాలని,లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ నేపథ్యంలో గడిచిన ఎనిమిది రోజుల్లో కొంత మేరకు ఇబ్బందులు తొలగడమే కాకుండా, సమస్యకు సరైన ఔషధం దొరికిందని ఆనందంలో ఉన్న అధికారులకు కొన్ని నిజాలు బహిర్గతం అయ్యాయి.అవిఏమిటంటే కొందరు మేధావులు వారికి కేటాయించిన షాపు పక్కన ఉన్న స్థలాన్ని ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకున్నారని సమాచారం.మార్కెట్అధికారులు ఇలాంటి వాళ్ళు ఎంత మంది ఉన్నారో గుర్తించే పనిలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.ఇలాంటి ద్వంద వైఖరి అవలంభిస్తున్న యాజమాన్యం పై కఠిన చర్యలు తీసుకోవాలని మార్కెట్ వర్గాలు డిమాండ్ చేస్తున్నారు.వీరి వల్ల ఇతరులకు గుదిబండగా మారి మార్కెట్ ఖజానాకు గండి కొట్టే వ్యక్తుల పై చర్యలు తీసుకోవడం సమంజసమని పలువురు అభిప్రాయపడుతున్నారు.మరో విషయం ఏమిటంటే మార్కెట్ అధికారులు ఇంకా లోతుగా అధ్యయనం చేస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని మరి కొందరు వారి అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.ఛైర్మన్ వివరణ: డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో అందరు సక్రమంగా వ్యాపార లావాదేవీలు నిర్వహించాలని,వ్యవసాయ మార్కెటింగ్ శాఖ 1969 చట్టం ప్రకారం వ్యాపారం కొనసాగించాలే, లేని పక్షంలో ఎవరైనా ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదంటూ గట్టిగా హెచ్చరించారు.ఈ మధ్యనే కొత్త ప్రయోగం చేసిన విషయం అందరికి తెలిసిందే.ఇప్పుడిప్పుడే సత్ఫలితాలు వస్తున్న నేపథ్యంలో అక్రమానికి గురైన దారి (రోడ్డు)వదిలే ప్రసక్తే లేదు! అవసరమైతే ఎవ్వరు కొమ్ము కాస్తున్నరో వారి పట్ల చర్యలకు వెనుకాడకుండా నోటీసులు జారీ చేస్తాం.అవసరమైతే న్యాయ సూచన తీసుకుని సంబంధించిన కమీషన్ దారుని లైసెన్సు రద్దు చేసే దిశగా అడుగులు వేస్తోంది కమిటీ అన్నారు.అలాగే ఇలాంటి విషయాలు నా దృష్టికి రావడం మొదటిసారి కాబట్టి అధికారులను కూడా అడిగి తెలుసుకుంటానన్నారుబోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు.

# కార్మికుల జీతాలు, బకాయిలు వెంటనే ఇవ్వాలి

**సీఐటియు మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్**

**కలెక్టరేట్ కార్యాలయం ముందు సీఐటియు ధర్నా**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) నూతనంగా ఏర్పాటైన పురపాలక సంఘాలైనా ఎల్లంపేట, మూడుచింతలపల్లి, అలియాబాద్ పురపాలక సంఘం కార్మికులకు రెండు నెలల జీతాలు ఇంకా చెల్లించలేదని సీఐటియు మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ అన్నారు. పురపాలక సంఘంలో విలీనమైన గ్రామపంచాయతీ కార్మికులకు మూడు నెలల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సీఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన పురపాలక సంఘం పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు రెండు నెలల జీతాలు ఇప్పటికీ రాలేదని తెలిపారు. విలీనమైన గ్రామపంచాయతీ కార్మికులకు మూడు నెలల వేతనాలు బకాయిగా ఉన్నాయని మొత్తం ఐదు నెలల జీతాలు ఇవ్వకుండానే వారు ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. ధర్నా సమయంలో ప్రజావాణి వద్ద అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తను కలుసుకుని ఈ వారంలో పురపాలక శాఖ కార్మికులకు జీతాలు చెల్లిస్తామని, గ్రామపంచాయతీ వేతనాలు కూడా త్వరలో అందజేస్తామని హామీ పొందారు. సీఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పురపాలక శాఖ కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం సరియైన చర్య కాదని హెచ్చరించారు. ఇలాగే ఉంటే పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో పురపాలక శాఖ కార్మికులకు రూ.18 వేల జీతాలు ఇచ్చేందుకు హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికీ కార్మికుల హక్కులను కాల రాస్తుందన్నారు. వెంటనే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు, కార్మికులు ప్రశాంత్, బిక్షపతి, మల్లయ్య, శీను, బాల్కొండ తదితరులు పాల్గొన్నారు.

# శ్రావణ మాసం మూడో సోమవారం

**- భీమేశ్వర ఆలయంలో భక్తి జ్యోతులతో మహాలింగార్చన**

**- జ్యోతులు వెలిగించి,ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ ఈఓ : రాధాభాయి**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వర ఆలయ ప్రాంగణం సోమవారం భక్తి జ్యోతులతో, శివనామ స్మరణతో కళకళలాడింది. పవిత్ర శ్రావణ మాసం మూడో సోమవారం సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్త విధానంలో మహాలింగార్చన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రారంభమైన పూజా కార్యక్రమంలో 365 జ్యోతులను లింగాకారంలో వెలిగించి స్వామివారికి అభిషేకాలు,అలంకరణలు చేశారు.ఆ తరువాత పుష్పార్చన, మహా మంగళహారతితో ఆలయం శోభాయమానంగా వెలిగింది. స్వామివారిని సువాసన గంధాలు,నానా రకాల పుష్పాలతో అలంకరించగా భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకున్నారు.ఈ మహోత్సవంలో ఆలయ ఈఓ రాధాబాయి జ్యోతులు వెలిగించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.వారి వెంట ప్రోటోకాల్ ఏఈఓ జి. అశోక్ కుమార్, అనుబంధాలయ పర్యవేక్షకులు ఊడెపు వెంకట ప్రసాద్, ఆలయ ఇన్స్పెక్టర్ టి. రాజేశ్వరరావు,ఆలయ సిబ్బంది ఉన్నారు.



# ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్న ఫంక్షన్ హాల్స్

**కమర్షియల్ నిర్మాణాలకు రెసిడెన్షియల్ టాక్స్ కలెక్షన్**
**ప్రజా ప్రతినిధుల,అధికారుల కనుసైగల్లో అక్రమంగా ఫంక్షన్ హాల్స్**
**జిహెచ్ఎంసి అధికారులు ఫంక్షన్ హాల్ ల పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి**
**రాజకీయ నాయకుల అండదండలే**
**ఫంక్షన్ హాల్ నిర్వాహకులకు శ్రీరామరక్ష**
**ఇంటి పన్ను కంటే ఫంక్షన్ హాల్స్ పన్ను చాలా తక్కువ**
**ప్రజల నుండి లక్షల్లో వసూళ్లు, ప్రభుత్వానికి వేయిలలో ట్యాక్స్ చెల్లింపులు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ లో లెక్కలేనన్నీ ఫంక్షన్ హాల్స్, కన్వెన్షన్ హాల్స్ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వానికి మాత్రం ఆదాయం ఫంక్షన్ హాల్స్ పై చాలా చాలా తక్కువ ఫంక్షన్ హాల్ యజమానులు కట్టే టాక్స్ ఇంటి యజమానులు కట్టే టాక్స్ కంటే కూడా చాలా తక్కువగా ఉంటుంది దీనిని పట్టి చూస్తే ప్రభుత్వాన్ని కళ్ళముందు దోచుకుంటున్న పట్టించుకున్న నాధుడే లేకుండా పోయాడు. కమర్షియల్ బిల్డింగ్ టాక్స్ కంటే కూడా ఫంక్షన్ హాల్ టాక్స్ లు చాలా తక్కువగా ఉంటాయని కారణం ఏమిటంటే రాజకీయ నాయకుల అండదండలే ఫంక్షన్ హాల్ నిర్వాహకులకు శ్రీరామరక్షగా మారిందని పార్టీ కార్యక్రమాలకు ఫంక్షన్ హాల్ లు వాడుకునే రాజకీయ నాయకులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న పట్టించుకోకుండా ఫంక్షన్ హాల్ నిర్వాహకులకు వత్తాసు పలుకుతున్నారని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ కర్ణన్ గ్రేటర్ హైదరాబాదులో ఫంక్షన్ హాల్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తే ప్రభుత్వానికి వచ్చే ఆదాయం చూసి సాక్షాత్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఆశ్చర్యపోక తప్పదు. కమర్షియల్ నిర్మాణాల కంటే కూడా ఫంక్షన్ హాల్ లో కట్టే టాక్స్ లు చాలా తక్కువగా ఉన్నాయని కొంతమంది జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్లు, టాక్స్ అధికారులు, సిబ్బంది ఏకమై ప్రభుత్వానికి రావలసిన టాక్స్ లు తమ జేబుల్లోకి వేసుకుంటూ కోట్లకు పడగలెత్తుతున్నారు. అలాగే కనీస పార్కింగ్ లేని ఫంక్షన్ హాల్ ఎన్నో హైదరాబాదులో ఉన్నాయని అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని రోజురోజుకు హైదరాబాదులో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోవడంతో ఫంక్షన్ హాల్ లో పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారని ప్రజలకు చాలా ఇబ్బందికరంగా మారుతుందని రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఫంక్షన్ హాల్ నిర్వాహకులకు పోలీసులకు రాజకీయ నాయకులకు మధ్య సంబంధాలతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఒక్క వాహనం కూడా పార్కింగ్ చేయలేని ఎన్నో ఫంక్షన్ హాల్స్ నిర్వహిస్తూ రోడ్లపై వాహనాల పార్కింగ్ చేసి పాదాచారులకు వాహనాదారులకు తీవ్ర ఇబ్బందులకు గురి గురి చేస్తున్నారు. వీటిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే స్థానిక రాజకీయ నాయకులు పోలీసులు ఏకమై ఫిర్యాదుదారుని పైనే అక్రమ కేసులు బనాయిస్తున్నారు. జిహెచ్ఎంసి నిబంధనల ప్రకారం పార్కింగ్ లేని ఫంక్షన్ హాల్స్ కు మున్సిపల్ అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారని, టాక్స్ ఎలా వసూలు చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.
500 నుంచి 1000 గజాల వరకు ఫంక్షన్ హాల్స్ ఉన్న వాటికి పార్కింగ్ సౌకర్యం లేదని పార్కింగ్ సౌకర్యం లేని ఫంక్షన్ హాల్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ ఫంక్షన్ హాల్ నిర్వాహకులు ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, సౌండ్ సిస్టంతో ఫంక్షన్ హాల్ పక్క నివసించే వారికి చాలా ఇబ్బందిగా ఉంటుందని ఇష్ట రాజ్యాంగ పార్కింగ్ చేయడంతో ప్రజలకు చాలా ఇబ్బంది కలుగుతుందని అనుమతులు లేని ఫంక్షన్ హాల్ పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టి ఫంక్షన్ హాల్ టాక్స్ లను తక్కువ కట్టే ఫంక్షన్ హాల్ పై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని ఫంక్షన్ హాల్ టాక్స్ లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ప్రభుత్వానికి గండి కొడుతున్న ఫంక్షన్ హాల్ నిర్వాహకుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పార్కింగ్ లేని ఫంక్షన్ హాల్ ను మూసివేయాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలో వచ్చాక ఎన్నో మార్పులు చేశారని ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న ఫంక్షన్ హాల్ పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని టాక్స్ ల రూపంలో తక్కువగా టాక్స్ లు చూపెడుతున్న ఫంక్షన్ హాల్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాదులో లెక్కకు మించిన ఫంక్షన్ హాలు నెలకొల్పుతున్నారని ప్రభుత్వానికి విరుద్ధంగా నిర్వహించే ఫంక్షన్ హాల్ పై చర్యలు చేపట్టాలని పార్కింగ్ లేకుండా రోడ్లపై ఇస్తాను సారంగా పార్కింగ్ చేసే ఫంక్షన్ హాల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రేవంత్ పాలనలో కాలక్షేపంగా మారిన ప్రజావాణి కార్యక్రమం

- **ఇట్స్ ఏ టైం పాస్ ప్రోగ్రాం**
- **ప్రజావాణికి అధికారులు గై హాజరు**
- **ప్రజావాణి అధికారుల నిర్లక్ష్యానికి అద్దం**
- **కలెక్టర్ ఆదేశాలు లెక్కచేయని జిల్లా అధికారులు**
- **కలెక్టర్ ఆదేశాలకు దిక్కులేదు ఇక ప్రజల సమస్యలు గాలికేగా**
- **గైర్హాజరు, ఫోన్లో గేమ్స్, లంచ్ లేటు ప్రజల సమస్యలపై పట్టింపేది**





నిజాంబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజావాణి... పేరు వినగానే ప్రజలు ఆశతో, సూదురా ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారు. సమస్యలు చెబితే తక్షణ పరిష్కారం లభిస్తుందనే నమ్మకం ఉంటుంది. కానీ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలలో జరుగుతున్న ప్రజావాణి అంటేనే ప్రజలకు నమ్మకం లేని వాణిగా మారిపోయింది. ప్రజావాణి కార్యక్రమంలో అధికారుల తీరుతో జరుగుతున్న పరిణామాలు ఆ నమ్మకాన్ని ఒక్కో రోజుతో పగలగొడుతున్నాయి. కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా లెక్కచేయకుండా కొంతమంది జిల్లా అధికారులు మాత్రం తమ "రాజసం" వదలలేకపోతున్నారు. కలెక్టర్ ఆదేశం ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.00 వరకు జిల్లా అధికారులు స్వయంగా ప్రజావాణిలో ఉండాలి. సమస్యలపై స్పందించి పరిష్కరించాలి కానీ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది, సమస్యని విరడం వినతి పత్రాలు తీసుకోవడం కింద అధికారులకు రాసి పంపించడం చేతులు దులుపుకోవడం ఇదే ప్రజావాణి అన్నట్లుగా మారింది పరిస్థితి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జిహెచ్ఎంసి కార్యాలయంలో ఇంతకన్నా ఇంకో అడుగు ముంగటికి పోదు తప్పుడు మెసేజ్లతో ఫిర్యాదుదారులను పిచ్చోళ్లను చేస్తున్నారు జిహెచ్ఎంసి అధికారులు. ప్రజావాణి కార్యక్రమాలకు కొంతమంది అధికారులు రాలేదు, కొంతమంది బదులుగా కిందిస్థాయి సిబ్బందిని పంపారు. మరికొందరు 2 గంటలకు లంచ్‌కి వెళ్లి 4.30కి కటకట లాంటి ముఖాలతో వచ్చారు. ఇంకొంతమంది అక్కడే కూర్చొని సెల్‌ఫోన్‌లో వీడియో గేమ్స్ ఆడటం%ొ% ఇది పరిపాలనా సమావేశమా లేక గేమింగ్ జోన్‌నా.? అన్నట్లుగా మారింది ప్రజావాణి కార్యక్రమం, మరి దీని కోసం ప్రజావాణి సమస్యలు తీర్చడానికే అన్నట్లు పాలకులు ఉన్నతాధికారులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వడం సామాన్యులను విస్మయానికి గురిచేస్తుంది. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సైతం ఇంతకన్నా అద్వాన్నంగా ఉంటుంది ప్రజావాణి కార్యక్రమం ఒక ఫోను కూడా తీసుకపోనియరు ఎందుకంటే అధికారులు ఏది పట్టించుకోరు ఫోన్లో వీడియో గేమ్లు ఆడతారు ఇవన్నీ ప్రజలు ఫోన్లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పెడతారన్న భయంతో ఫోన్లను బ్యాన్ చేశారు ఎంతైనా అధికారులు వాళ్ళు చేయరు చేసే నిర్లక్ష్యం సమాజానికి తెలియనివ్వరు అలా ఉంది ప్రభుత్వ పాలన కెసిఆర్ పాలన అద్వాన్నమంటే రేవంత్ రెడ్డి పాలన అత్యంత అధ్వానం అన్నట్లుగా మారింది పరిస్థితి. మరి ఎప్పటికీ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించే ప్రభుత్వం ఎప్పుడు వస్తుందో వేచి చూడాలి.ప్రజావాణి అనేది ప్రజల హక్కు, అధికారుల కర్తవ్యం. అది "ఐచ్ఛికం" కాదు. ఈ వేదికలో ప్రజల సమస్యలు వినకుండా, ఆ సమస్య పరిష్కరించగల వ్యక్తి గైర్హాజరైతే, అది నేరం లాంటిదే. ప్రజల సమయాన్ని, కష్టపడి వచ్చిన వారిని ఇలా నిర్లక్ష్యం చేయడం పరిపాలనకు అవమానం.కలెక్టర్ సూచన స్పష్టం అత్యవసరమైన పని ఉంటే ముందుగానే చెప్పాలి, లేకుంటే గైర్హాజరు అయితే కఠిన చర్యలు తప్పవు. కానీ ఈ హెచ్చరికను కొందరు అధికారులు చెవిలో వేసుకున్న కాటన్ బంతిలా పట్టించుకోవడం లేదు.ఇది ఇక్కడితో ఆగకూడదు.ప్రజావాణికి గైర్హాజరు అయిన అధికారుల పేర్లు బహిరంగంగా ప్రకటించాలి. క్రమశిక్షణ చర్యలు వెంటనే ప్రారంభించాలి. "జిల్లా అధికారి" అనిపించుకోవాలంటే ముందుగా "ప్రజా సేవకుడు"గా ప్రవర్తించాలి. ప్రజావాణి ఒక నాటకం కాదు. ఇది ప్రజాస్వామ్యానికి నాడి. ఆ నాడి కత్తిరించే నిర్లక్ష్యం చేసినవారు, పదవులు, హోదాలు ఏమైనా కావచ్చు, ప్రజల కోపం నుండి తప్పించుకోలేరు. ప్రజావాణి కేవలం మంగళవారం పేపర్‌లో వచ్చిన ఫోటో కోసం కూర్చోనే వేదిక కాదు. ఇది ప్రజల న్యాయం కోసం పోరాట వేదిక. ఆ వేదికను సీరియస్‌గా తీసుకోని అధికారులు, తమ కుర్చీలు సురక్షితమని అనుకోవడం మూర?త్వం.
ప్రజలు ఒక్కసారిగా "ప్రజావాణి" నుంచి "ప్రజావిక్షణ" మోడ్‌లోకి మారితే, ఆఫీసు గదుల గోడలు కూడా వారి నిరసనతో దద్దరిల్లుతాయి.

## ప్రజావాణిలో వికలాంగుడిని తోసిపుచ్చిన ఘటనకు స్పందించిన మంత్రి అడ్లూరి

**-మెట్పల్లి ఆర్ డి ఓ శ్రీనివాస్ కు ఫోన్ చేసి తక్షణమే వికలాంగుడి సమస్యను పరిష్కరించాలి**



జగిత్యాల(ప్రశ్న న్యూస్) జగిత్యాల ప్రజావాణిలో వికలాంగుడిని తోసిపుచ్చిన ఘటన చాలా బాధాకరమని సంక్షేమ శాఖా మంత్రి అడ్లూరి అన్నారు.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తకు వెంటనే సంక్షేమ శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పందించారు. మెట్పల్లి ఆర్ డి ఓ శ్రీనివాస్ కు ఫోన్ చేసి తక్షణమే వికలాంగుడి సమస్యను పరిష్కరించాలి అని మంత్రి అడ్లూరి తెలిపారు.

## అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

**చర్యలు తీసుకోండి సూర్య కిరణ్**
**హుజురాబాద్ లో జోరుగా అక్రమ నిర్మాణాలు**



హుజురాబాద్(ప్రశ్న న్యూస్) హుజూరాబాద్ పట్టణంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల పై చర్యలు తీసుకోవడంలో విఫలమైన టౌన్ ప్లానింగ్ అధికారుల పై ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ తెలంగాణ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ సభ్యుడు కొలుగూరి సూర్యకిరణ్ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేకి ఫిర్యాదు చేశారు..గత సంవత్సర కాలంగా హుజురాబాద్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా, సెట్‌బ్యాక్‌లు పాటించకుండా అనేక నిర్మాణాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ విషయమై పురపాలక సంఘం కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. సూర్యకిరణ్ ఫిర్యాదుకు స్పందించిన అదనపు కలెక్టర్, ఈ విషయంపై తప్పకుండా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులను విచారణకు ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ అధికారిపై చర్యలు తీసుకునేంత వరకు పోరాటం కొనసాగిస్తానని సూర్యకిరణ్ తెలిపారు.

## సివిల్స్ అభ్యర్థులకు లక్ష చొప్పున సాయం

**- 178 మంది అభ్యర్థులకు చెక్కులు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) : సివిల్స్ 2025 మెయిన్స్ పరీక్షకు క్వాలిఫై అయిన అభ్యర్థులకు ప్రభుత్వం లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించింది. యూపీఎస్సీ సర్వీసెస్ పరీక్షలో ప్రిలిమ్స్ క్వాలిఫై అయిన అభ్యర్థులకు ఆర్థికంగా అండగా నిలుస్తోంది. వాళ్లు మెయిన్స్ పరీక్షకు ప్రిపేర్ అయ్యేందుకు ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున పంపిణీ చేసింది. చెక్కులను విడుదల చేసింది. ఇప్పుడు సివిల్స్-2025 మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించిన 178 మంది అభ్యర్థులకు చెక్కులు అందించారు అధికారులు. 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం పేరుతో సివిల్స్ ప్రిలిమ్స్ క్వాలిఫై అయి మెయిన్స్ కు క్వాలిఫై అయిన వారికి ఈ ఆర్థిక సాయం అందించారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకాన్ని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్.. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ద్వారా అందిస్తోంది. ఈ పథకానికి అప్లై చేసుకోడానికి అభ్యర్థులు తెలంగాణ రాష్ట్రంలో శాశ్వత నివాసి అయి ఉండాలి. అలాగే ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యుఎస్, ఓబీసీ వర్గాలకు చెందినవారై ఉండాలి. అభ్యర్థి యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షలో పాసై ఉండాలి. అప్లయ్ చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ. 8 లక్షల లోపు ఉండాలని ప్రభుత్వం రూల్ పెట్టింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588